

• శ్రావణలక్ష్మి నమోసుత్తే..

శ్రావణమాసం రెండవ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మి వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి ప్రతిమను అలంకరించి పూజ అనంతరం మహిళలకు వాయినాలు అందించారు. అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. చిత్రంలో ప్రత్యేక అలంకరణలో నూజివీడు కోట మహిషాసురమ్మ.



నూజివీడు అన్న క్యాంటీన్‌లో అల్పాహారాలు అందిస్తున్న మంత్రి కొలుసు

పేదవాడి కడుపు నిండగా..

పేదోడి కల నెరవేరింది.. కడుపు నిండింది. అన్న క్యాంటీన్లు ఐదేళ్ల తర్వాత శుక్రవారం తెరుచుకున్నాయి. కూటమి ప్రభుత్వంలో ప్రజాప్రతి నిధులు, అధికారులు ఎక్కడా హడావుడి చేయకుండానే ఉదయం అల్పాహారంతో అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఆరు అన్న క్యాంటీన్లను ప్రారంభించాలని భావించినా తొలిరోజు జంగారెడ్డిగూడెం మినహా నూజివీడులో ఒకటి, ఏలూరులో మరో నాలుగు ప్రారంభించారు. నూజివీడులో రాష్ట్ర సమాచార మంత్రి కొలుసు పార్థసారథి లాంఛనంగా ప్రారంభించి అల్పాహారం స్వీకరించారు. ఏలూరు ఆర్‌ఆర్‌. పేట వేంకటేశ్వర స్వామి గుడి వద్ద ఉదయం ఎమ్మెల్యే బడేటి చంటి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, నగర మేయర్‌ షేక్‌ నూర్జహాన్‌ ప్రారంభించారు.

5

‘సర్దుబాటు’పై మరికొన్ని అభ్యంతరాల పరిష్కారం

ఏలూరు అర్బన్‌, ఆగస్టు 16 : సర్‌ప్లస్‌ ఉపాధ్యాయుల పని సర్దు బాటుకు సంబంధించి అందిన అభ్యంతరాలను పరిష్కరిస్తూ మలి విడత సీనియార్టీ జాబితాలు శుక్రవారం జిల్లాకు పంపారు. అభ్యంతరాల్లో కొన్నిం టిని పరిష్కరించగా, మరికొన్నింటిని పరిష్కారయోగ్యంకానివిగా తేల్చారు. ఇటీవల సవరించిన షెడ్యూలు ప్రకారం మండలాల్లో సర్‌ప్లస్‌ టీచర్లకు వర్క్‌ అడ్జస్ట్‌మెంట్‌ కౌన్సెలింగ్‌ 17, 19 తేదీల్లో జరగాల్సి ఉండగా, తాజా సమాచారం ప్రకారం మరికొన్నిరోజులు పట్టే అవకాశాలున్నాయి. ఇంకా పలు విషయాలపై ఉపాధ్యాయ సంఘాల నుంచి అందిన సూచనలను పరిగణనలోకి తీసుకుని, ఆ మేరకు సవరణలు చేసిన తర్వాతే తుది సీనియార్టీ జాబితాలతో కౌన్సెలింగ్‌ చేపడతారని తెలుస్తోంది. కాగా వర్క్‌ అడ్జస్ట్‌మెంట్‌పై శుక్రవారం సాయంత్రం విద్యాశాఖ ఉన్నతాధికారులు జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. వివరాలు తెలియ రాలేదు.

అదనపు ఎస్పీల బదిలీలు

ఏలూరు క్రైం, ఆగస్టు 16 : రాష్ట్రంలో పనిచేస్తున్న అదనపు ఎస్పీలలో 49 మందిని బదిలీ చేస్తూ శుక్రవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్‌) జి.స్వరూపరాణిని పోలీసు హెడ్‌ క్వార్టర్స్‌కు రిపోర్టు చేయాలని ఉత్తర్వులు ఇచ్చింది. ఈమె గత సార్వత్రిక ఎన్నికలకు ముందు జిల్లాకు బదిలీపై వచ్చారు. ఏలూరు జిల్లా రీజనల్‌ విజిలెన్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారిగా పనిచేస్తున్న అదనపు ఎస్పీ కరణం కుమార్‌ను పోలీసు హెడ్‌ క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని ఉత్వర్వులు ఇచ్చింది. ఆయన ఈ నెలాఖరులో ఉద్యోగ విరమణ చేయనున్నారు. ప్రకాశం జిల్లా ఎస్‌ఈబీ అదనపు ఎస్పీగా నియమించబడిన ఎం.సూర్యచంద్రరావు ఏలూరు జిల్లా ఎస్‌ఈబీ అదనపు ఎస్పీగా పని చేస్తున్నారు. ఆయనను సీఐడీ అదనపు ఎస్పీగా నియమించారు. పశ్చిమ గోదావరి జిల్లా ఎస్‌ఈబీ అదనపు ఎస్పీగా పని చేస్తున్న ఏటీవీ రవికుమార్‌ను ఇంటెలిజెన్స్‌ అదనపు ఎస్పీగా బదిలీ చేశారు.

వైసీపీ ఆఫీస్‌.. ఫటాఫట్‌!





ఏలూరులో తొలగించిన వైపీపీ కార్యాలయం

మొన్నటికి మొన్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని పదవికి రాజీనామా. నేడు తాజాగా జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయాన్ని ఖాళీ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజు ఇదే కార్యాలయంలో స్థానిక నేతలు కొందరు జెండా వందనం చేసిన కొద్ది క్షణాల విరామంలోనే కార్యాలయాన్ని ఖాళీ చేయడం ఆరంభించారు. ఇప్పటికే కొత్త రైల్వే స్టేషన్‌ వద్ద ఆ పార్టీ నిర్మించిన కొత్త పార్టీ కార్యాలయం వివాదాల్లో చిక్కుకుంది. అధికారం కోల్పోయిన రెండు నెలల్లోనే వైసీపీ సరికొత్త అనుభవాన్ని ఎదుర్కొంటుంది.

- అధికారం కోల్పోయిన రెండు నెలలకే ఏలూరులో పార్టీ జిల్లా ఆఫీసు గల్లంతు
- స్వాతంత్ర్య దినోత్సవం రోజే తొలగింపునకు ముహూర్తం
- గంటలు గడిచినా ఇదంతా గోప్యమే..
- విస్తుపోతున్న వైసీపీ శ్రేణులు
- ఏలూరులో మరింత ముదిరిన వైసీపీ సంక్షోభం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

జిల్లాలో వైఎస్సార్‌ సీపీకి మొదటి నుంచి ఒడిదుడుకుల ప్రయాణమే. ఆ పార్టీ నేతలు ఎవరంతట వారుగా తామే కింగ్‌లమనే రీతిలో వ్యవహరించడంతో ఈ పరిస్థితి దాపురించింది. చాన్నాళ్ళుగా పార్టీ కార్యాలయం సరైనది లేకపోవడంతో ఎన్నికలకు ముందే పార్టీ రోజువారీ కార్యకలాపాల నిర్వహణకు ఏలూరు ఎన్‌ఆర్‌ పేట, ఆర్‌ఆర్‌ పేటలలో తాత్కాలికంగా ఆఫీసులను ఏర్పాటు చేశారు. ఎన్‌ఆర్‌ పేటలో ఏళ్ల పాటు నిర్వహించినా కీలక సమయాల్లో ఆ కార్యాలయం పనికి రావడం లేదని, సమావేశాలకు సరిపోవడంలేదని భావించి అక్కడి నుంచి ఆర్‌ఆర్‌ పేటలోని మరొకరి ప్రైవేటు స్థలంలో లీజుకు తీసుకుని మరీ తాత్కాలికంగా కార్యాలయాన్ని నిర్మించారు. దీనికి భారీ అద్దెను చెల్లిస్తున్నారు. అయితే రెండు నెలల క్రితం పార్టీ అధికారం కోల్పోవడంతో వైసీపీ నేతలు, కార్యకర్తలెవరూ ఆ కార్యాలయంవైపు తొంగిచూసిన పాపాన పోలేదు. కొంతమంది సిటీ నాయకులు అడపాదడపా చిన్నపాటి సమావేశాలను నిర్వహిస్తూ వచ్చారు. స్వాతంత్ర దినోత్సవం రోజున కొందరు స్థానిక నేతలు ఆ కార్యాలయంలోనే జాతీయ జెండా ఎగురవేశారు. అయితే కొద్ది గంటల వ్యవధిలోనే కార్యాలయాన్ని ఖాళీ చేయడం ప్రారంభించారు. తాత్కాలిక నిర్మాణం కావడంతో సీలింగ్‌లను అప్పటికప్పుడే తొలగించారు. ఫర్నీచర్‌ను వేరే ప్రాంతానికి తరలించారు. వాస్తవానికి ఈ కార్యాలయం నిర్వహణ వ్యవహారంలో కొంత పార్టీలోను గతంలో అలజడి రేపింది. రెండు నెలల క్రితం వరకు ఏలూరు ఎమ్మెల్యేగా కొనసాగిన ఆళ్ల నాని దగ్గరుండి మరీ దీనిని చూసుకునేవారు. ఎప్పుడైతే అధికారం కోల్పోయారో అప్పటి నుంచే నాని ఏలూరుకు ముఖం చాటేశారు. పార్టీలో మొదటి నుంచి జగన్‌ను, ఆళ్ల నానిని నమ్ముకుని ఉన్న కార్యకర్తలు, నేతలు వైసీపీ కార్యాలయానికి వచ్చిపోతుండేవారు. అలాంటి పార్టీ కార్యాలయానిన ఒక్కసారిగా తొలగించడం వైసీపీ కార్యకర్తలను విస్మయపరిచింది. వాస్తవానికి ఈ కార్యాలయం లీజు ఇప్పటికే ముగియడంతో స్థల యజమాని గట్టిగా ఒత్తిడి తేవడంతోనే ఒక చేసేదిలేక మరో ప్రత్యామ్నాయం చూపకుండానే వైసీపీ జిల్లా కార్యాలయాన్ని తొలగించేందుకు అనుమతిచ్చినట్టు సమాచారం. నియోజకవర్గంలో ఓ స్థాయి కలిగిన పది మంది నేతలకు కూడా శుక్రవారం వరకు ఈ విషయం తెలియకపోవడం విచిత్రం. కేవలం గురువారం స్థానిక నేతలు కొందరు ఏకపక్షంగా జెండా వందనానికి దిగడంతోనే



ఆగ్రహంతో కొంతమంది పార్టీ జిల్లా కార్యాలయం తొలగించేలా ఏర్పాట్లు చేశారని ప్రచారం గుప్పుమంది.

వైసీపీకి ఇది రెండో షాక్‌

ఎన్నికలు ముగిసి పట్టుమని రెండునెలలు దాటకముందే వైసీపీలో వరుస సంక్షోభాలు చోటు చేసుకుంటున్నాయి. ఏలూరు నియోజకవర్గ నాయకత్వం ఎక్కడికక్కడ చెల్లాచెదురైంది. మాజీ ఎమ్మెల్యే నాని గడిచిన కొద్ది రోజుల క్రితమే పార్టీ జిల్లా అధ్యక్ష పదవికి, ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పదవికి గుడ్‌బై చెప్పారు. అయినా కూడా రాష్ట్ర నాయకత్వం జిల్లాలో సాగుతున్న పరిణామాలపై పెద్దగా దృష్టిసారించలేదు. కేవలం కొంతమంది పార్టీని వీడుతున్నట్టు గానే లైట్‌గా తీసుకున్నారు. కాని అంతర్గతంగా నాని రాజీనామా అనంతరం పార్టీలో అత్యధికులు వైసీపీకి రాజీనామా చేసి జనసేన లేదా టీడీపీలో చేరేందుకు సమాయత్తం అవుతున్నారు. ఇలాంటి సమయంలోనే పార్టీ జిల్లా కార్యా లయాన్ని తొలగించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఎందు కంటే.. కొత్త రైల్వేస్టేషన్‌ సమీపాన ఏఎస్‌ఆర్‌ స్టేడియం పక్కన భారీ హంగులతో నూతన కార్యాలయాన్ని రూ.ఐదు కోట్లు వెచ్చించి మరీ నిర్మించారు. తిరిగి అధికారంలోకి రాగానే జగన్‌ చేత ప్రారంభించాలని ఆ పార్టీ నేతలు వ్యూహం సిద్ధం చేశారు. ఇదంతా బెడిసికొట్టింది. అనుమతులు లేకుండా భారీ కట్టడాన్ని నిర్మించడంపై మునిసిపల్‌ కార్పొరేషన్‌ ఆగ్రహం వ్యక్తం చేస్తూ నోటీసులు జారీ చేసింది. దీనిని వైసీపీ రాష్ట్ర నాయకత్వం హైకోర్టులో సవాల్‌ చేసింది. మరోవైపు పాత కార్యాలయాన్ని హఠాత్తుగా తొలగించారు. దీంతో వైసీపీ జిల్లా కార్యాలయం లేకుండా పోయింది. ఒకవైపు పార్టీలో అంతర్గత సంక్షోభాన్ని చవిచూస్తుండగా ఇప్పుడు దాని ప్రభావం కాస్తా పార్టీ కార్యాలయాలపైన పొడచూపినట్టయ్యింది. అధికారంలో ఉన్నప్పుడు ఎడాపెడా పెత్తనం చేసిన వైసీపీ నేతలంతా ఇప్పుడు గప్‌చుప్‌ అయ్యారు. వరుసగా జరుగుతున్న పరిణామాల క్రమంలో ఎటూ పాలుపోక మిన్నకుండిపోతున్నారు. ఆళ్ల నాని రాజీనామా అనంతరం చోటు చేసుకున్న ఈ పరిణామాలను పార్టీలో కొందరు ఇంకో రకంగా చెబుతున్నారు. గతంలోను ఆళ్ల నాని తాను ఉమ్మడి జిల్లా పెత్తనం చేస్తేనే పార్టీకి జీవం అని, లేదంటే అభాసుపాలే అన్నట్టుగా వ్యవహరించిన ఉదంతాలను గుర్తు చేస్తున్నారు. దీనికితోడు వైసీపీ నాయకత్వం ఇప్పుడు డీలా పడింది. జరుగుతున్న పరిణామాలపై తక్షణం జిల్లా నేతలను పిలిపించి చర్చించే స్థాయిలో లేకుండాపోయింది. ఇప్పుడు అధికారం ఎలాగూ లేదు కాబట్టి వైసీపీలోను ఆ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. దీనికి ప్రత్యక్ష నిదర్శనం ఆ పార్టీకి జిల్లా కార్యాలయం లేకపోవడమే.

నేడు ప్రైవేటు ఆస్పత్రుల బంద్‌

- కోల్‌కతా ఘటనలకు నిరసనగా ఐఎంఏ పిలుపు

ఏలూరు అర్బన్‌/ఏలూరు క్రైం, ఆగస్టు 16 : కోల్‌కతా ఆర్జీ కర్‌ ప్రభుత్వ వైద్యకళాశాల బోధనాసుపత్రిలో ఈ నెల 9న పోస్ట్‌గ్రాడ్యుయేషన్‌ ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య, తదనంతరం ఆస్పత్రిలో విచ్ఛిన్నకర శక్తుల విధ్వంసాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా శనివారం ఉదయం 6గంటల నుంచి ఆదివారం ఉదయం 6గంటల వరకు అన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో 24గంటల పాటు అన్నిరకాల వైద్య సేవల బంద్‌కు ఇండియన్‌ మెడికల్‌ అసోసియేషన్‌ (ఐఎంఏ) పిలుపునిచ్చింది. ఈ మేరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఆస్పత్రుల బంద్‌ ఏర్పాట్లను ఐఎంఏ-హాస్పిటల్‌ బోర్డు ఆఫ్‌ ఇండియా జాతీయ వైస్‌ఛైర్మన్‌ డాక్టర్‌ సి.శ్రీనివాస రాజు ఓ ప్రకటనలో తెలిపారు. అత్యవసర వైద్యసేవలు మినహా మిగతా అన్నిరకాల వైద్యసేవలను నిలిపివేస్తారన్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1350 ప్రైవేటు, కార్పొరేట్‌ ఆస్పత్రులు, చిన్నపాటి ఆస్పత్రులు, క్లినిక్‌లు, నర్సింగ్‌ హోంలు ఉన్నాయని, ఈ ఆస్పత్రుల యాజమాన్యాలన్నీ బంద్‌కు సంపూర్ణ మద్దతును తెలియజేశాయన్నారు. సాధారణ విధులకు ఆటంకం లేకుండా ప్రభుత్వాస్పత్రుల వైద్యులు బంద్‌కు సంఘీభావాన్ని తెలియజేస్తారన్నారు. వైద్యులు, సిబ్బంది భద్రత కోసం దేశవ్యాప్తంగా అమలయ్యేలా కఠినమైన సెంట్రల్‌ మెడికల్‌ రక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. అన్ని వైద్య కళాశాలలు, ప్రభుత్వ ఆస్పత్రులను సేఫ్‌జోన్‌గా ప్రకటించి, రక్షణ చర్యలు తీసుకునేలా ఆర్డినెన్స్‌ను తీసుకురావాలన్నారు. ఆస్పత్రి వైద్యులపై జరిగిన దాడులపై విచారణ త్వరగా ముగించేలా ఒక చట్టాన్ని అన్ని రాష్ట్రాలకు వర్తించేలా కేంద్ర ప్రభుత్వమే తీసుకురావాలన్నారు.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద నిరసన

కోల్‌కతా ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం కేసులో నిందితులపై సత్వర చర్యలు చేపట్టాలని డిమాండ్‌ చేస్తూ శుక్రవారం ఏలూరు డీఎంహెచ్‌వో పరిధిలో పనిచేస్తున్న పీహెచ్‌సీల వైద్యాధికారులు, ప్రభుత్వ వైద్యకళాశాల వైద్యవిద్యార్థులు, కార్యాలయ ఉద్యోగులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం(జీడీఏ) ఇచ్చిన పిలుపుమేరకు జరిగిన ఈ నిరసన ప్రదర్శనలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్‌ నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న వైద్యసిబ్బంది భద్రతకు ప్రస్తుతం అమల్లో వున్న చట్టాన్ని సవరించాలన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలని అప్పటి వరకు ఉద్యమిస్తామన్నారు.



• ఏలూరులో కొవ్వొత్తుల ర్యాలీ

‘మా కుటుంబాలకు దూరంగా ఉంటూ మేమంతా ప్రజల ప్రాణాలు కాపాడడానికి సేవలు అందిస్తున్నా నిత్యం భయం భయంతోనే బిక్కుబిక్కుమంటూ విధులను నిర్వర్తించాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. మాకు రక్షణ కల్పిస్తేనే మేమంతా ప్రజలకు ధైర్యంగా సేవలందించి ప్రాణాలు కాపాడగలం’ అంటూ ఏలూరు ప్రభుత్వాస్పత్రి వైద్యులు, మెడికోలు, నర్సింగ్‌ విద్యార్థులు శుక్రవారం రాత్రి కోల్‌కతా ఘటనను ఖండిస్తూ కొవ్వొత్తులతో నిరసన ర్యాలీని నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రి నుంచి ఫైర్‌స్టేషన్‌కు చేరుకుని అక్కడ కొద్దిసేపు నినాదాలు చేశారు. మెడికల్‌ కాలేజీ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ శశిధర్‌, ప్రభుత్వాసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ మల్లిఖార్జునరాజు, డాక్టర్‌ ఏఎస్‌ రామ్‌, డాక్టర్‌ పీఏఆర్‌ఎస్‌ శ్రీనివాస్‌, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్‌ నాగేశ్వరరావు పలువురు వైద్యులు మాట్లాడుతూ కోల్‌కతా ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ‘నా సొంత ఊరు కేరళ. నేను పీజీ విద్యార్థిగా ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలు జనరల్‌ మెడిసిన్‌లో అందిస్తున్నాను. ఇలాంటి ఘటనలతో నా కుటుంబ సభ్యులు భయభ్రాంతులకు గురవుతున్నారు’.. అంటూ డాక్టర్‌ ప్రమీష (డీఎన్‌బి పీజీ స్టూడెంట్‌) పేర్కొన్నారు. ‘నాది హైదరాబాద్‌. ప్రభుత్వాసుపత్రిలో పోలీస్‌ ఔట్‌ పోస్టును ఏర్పాటు చేసి 24 గంటలు రక్షణ చర్యలు తీసుకోవాలి. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు అయిందని గొప్పగా చెప్పుకుంటున్నాం. మహిళలకే రక్షణ కల్పించలేని పరిస్థితులు ఉన్నాయి’ అని డాక్టర్‌ చందన (ఈఎన్‌టీ పీజీ స్టూడెంట్‌) ఆవేదన వ్యక్తం చేశారు.

ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో విధుల బహిష్కరణ

పశ్చిమ బెంగాల్‌లో జరిగిన వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటనలో దోషులను కఠినంగా శిక్షించే వరకు ఉద్యమం తీవ్రతరం చేస్తామని ఏలూరు ప్రభుత్వాస్పత్రి వైద్యులు, నర్సులు డిమాండ్‌ చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి శుక్రవారం ఉదయం ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో వైద్యులు గంట పాటు విధులను బహిష్కరించి ఆస్పత్రి వద్ద ధర్నా నిర్వహించారు. వైద్యులు డాక్టర్‌ ధన్య శ్రీ, డాక్టర్‌ లావణ్య, డాక్టర్‌ చందన, డాక్టర్‌ చాందిని, డాక్టర్‌ మొబీనా, డాక్టర్‌ రేష్మా, డాక్టర్‌ ఎఎస్‌రామ్‌, డాక్టర్‌ పీఏఆర్‌ఎస్‌ శ్రీనివాసులు, డాక్టర్‌ సికింద్రమోహన్‌, డాక్టర్‌ వంశీకృష్ణ మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగ కుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఏఐటీయూసీ నాయకులు కృష్ణమాచార్యులు, ఏపీ మెడికల్‌ ఎంప్లాయిస్‌ యూనియన్‌ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణమూర్తులు నాయకత్వం వహించారు.

విజిలెన్స్ డీఎస్పీ వెంకటేశ్వరరావుకు ఇండియన్ పోలీస్ మెడల్



ఆకివీడురూరల్ ఆగస్టు 16 : ఆకివీడు మండలం అజ్జమూరు గ్రామానికి చెందిన సింగులూరి వెంకటేశ్వరరావు స్వాతంత్ర్య దినోత్సవం రోజు ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు చేతుల మీదుగా ఇండియన్ పోలీసు మెడల్ స్వీకరించారు. ఆయన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా విజిలెన్స్ డీఎస్పీగా పనిచేశారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన ఆయన 1991లో ఎస్‌ఐగా, 2008లో సీఐగా సాధారణ, ఏసీబీ శాఖలలో పనిచేశారు. 2020లో డీఎస్పీగా పదోన్నతి పొంది ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఏసీబీ డీఎస్పీగా పనిచేశారు. ప్రస్తుతం విజిలెన్స్ డీఎస్పీగా తిరుమలలో విచారణ బృందంలో ఉన్నారు.

ఏపీ నిట్‌లో నేడు స్నాతకోత్సవం



తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 16: ఏపీ నిట్ 6వ స్నాతకోత్సవానికి ముస్తాబైంది. ఈనెల 17న నిర్వహించే స్నాతకోత్సవాలకు ప్రాంగణంలోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. 2020-24 వరకు బీటెక్ పూర్తి చేసుకున్న 527 మంది విద్యార్థులకు పట్టాలు అందజేయనున్నారు. వీరితో పాటు రెండేళ్ల ఎంటెక్ కోర్సు పూర్తి చేసిన 15 మంది విద్యార్థులకు డిగ్రీలు, 25 మంది పరిశోధనా విద్యార్థులకు డాక్టరేట్ పట్టాలను అందజేయనున్నారు. ఆయా కోర్సుల్లో గ్రేడు పాయింట్లు సాధించిన 8 మందికి బంగారు పతకాలు అందజేయనున్నారు. ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ బీఎస్ మూర్తి అధ్యక్షతన నిర్వహించే కార్యక్రమానికి హిమాచల్ ప్రదేశ్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ బోర్డు ఆఫ్ గవర్నెన్సు ఛైర్మన్, ఐఐటీ అల్యుమిని కౌన్సిల్ ప్రెసిడెంట్ డాక్టర్ రవిశర్మ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

అర్హులు టీచరు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

తణుకు, ఆగస్టు 16 : ఉమ్మడి తూర్పు, పశ్చిమ ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి నవంబరు 1వ తేదీలోగా కొత్త టీచరు ఓటరు నమోదు జాబితా తయారు కోసం అర్హులైన వారు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ అశోకవర్మ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సెకండరీ స్కూలు, జూనియర్ కాలేజీ, ప్రభుత్వ, ప్రవేటు ఐటీఐ, మోడల్ స్కూళ్లతో పాటు వివిధ విద్యా సంస్థల్లో మూడు సంవత్సరాలపాటు ఉపాధ్యాయులుగా పనిచేసిన వారు ఉపాధ్యాయ ఓటరుగా నమోదుకు అర్హులన్నారు.

తూర్పు గోదావరి జల్లాలో ఉచిత ఇసుక స్టాక్

భీమవరంటౌన్, ఆగస్టు 16 : తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ఉసులుమర్రులో 5,603 మెట్రిక్ టన్నులు, పెండ్యాలలో 1,06,758 మెట్రిక్ టన్నులు, నిడదవోలు మండలం పందలపర్రులో 38,566 మెట్రిక్ టన్నుల ఇసుక స్టాక్ ఉందని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఆయా స్టాక్ పాయింట్లు వద్ద టన్నుకి రూ.270 లకు చెల్లించి ఉచిత ఇసుక పొందవచ్చన్నారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురంలో 29, 527మెట్రిక్ టన్నులు ఉందని టన్నుకి రూ 265 చెల్లించి పొందవచ్చు అని కలెక్టర్ తెలిపారు.

రైల్వే ప్రయాణికులకు అసౌకర్యం కల్పించవద్దు



తనిఖీ చేస్తున్న రైల్వే అధికారులు

ఏలూరు క్రైం, ఆగస్టు 16 : రైల్వే ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యాలు కల్పించినా సహించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని విజయవాడ రైల్వే వాణిజ్య శాఖ అధికారులు హెచ్చరించారు. విజయవాడ డివిజన్ కమర్షియల్ మేనేజర్ ఎండీ అలీఖాన్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ల బృందం శుక్రవారం ఆకస్మికంగా ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. రైల్వే స్టేషన్‌లో బుకింగ్ కౌంటర్, క్యూఆర్ కోడ్‌ల ప్రదర్శన, పార్శిల్ ఆఫీస్, క్యాటరింగ్, వాటర్ వెడ్డింగ్ స్టాల్స్‌ను పరిశీలించారు. డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించాలని సూచించారు. అప్పుడే వచ్చి ఆగిన కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ప్యాంట్రీ కార్‌ను పరిశీలించారు. పదార్థాల గడువు తేదీలు, ఆహార పదార్థాల పరిశుభ్రత, విక్రేతల గుర్తింపుకార్డు, వైద్య ధృవీకరణ పత్రాలు పరిశీలించారు. మేనేజర్ అలీఖాన్ మాట్లాడుతూ ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలని, నాణ్యమైన ఆహారపదార్థాలు విక్రయించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

రేపు భీమవరం రైల్వే గేటు మూత

భీమవరం క్రైం, ఆగస్టు 16 : భీమవరం పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న 118 నెంబర్ రైల్వేగేటును ఈనెల 18వ తేదీ ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. గేటు మరమ్మతులు, రోడ్డు పనుల నిమిత్తం మూసి వేస్తున్నట్లు తెలిపారు. ఆ ఒక్క రోజు ప్రయాణికులు సహకరించాలని అధికారులు కోరారు.

విద్యారంగాన్ని చక్కదిద్దే చర్యలు చేపట్టాలి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ లక్ష్మణరావు



ఏలూరు అర్బన్, ఆగస్టు 16 :రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వపాలనలో విధ్వంసానికి గురైన విద్యారంగాన్ని కూటమి ప్రభుత్వం చక్కదిద్దే చర్యలు చేపట్టాలని కృష్ణాగుంటూరు జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. రెండు రోజులపాటు జరిగే ఎస్ఎఫ్ఐ రాష్ట్రస్థాయి సమావేశాలు శుక్రవారం ఏలూరు సీఐటీయు కార్యాలయంలో ప్రారంభమయ్యాయి. తొలిరోజు సమావేశాలకు ఎమ్మెల్సీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో చర్చించిన అంశాలను ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లెనిన్ పత్రికలకు తెలియజేశారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విద్యారంగంలో అనేక లోటుపాట్లు ఉన్నాయని, ప్రైవేటు విశ్వ విద్యాలయాల స్థాపనకు అనుమతులను నిలిపివేయాలని, ప్రభుత్వ విశ్వ విద్యాల యాలను బలోపేతం చేయడానికి ఖాళీగా వున్న 5 వేల అధ్యాపక, అధ్యాపకేతర పోస్టులను భర్తీ చేయాలన్నారు. డిగ్రీ ఆన్‌లైన్ అడ్మిషన్ల విధానాన్ని, మేజర్, మైనర్ సబ్జెక్టులను రద్దు చేయాలని కోరారు.నూతన జాతీయ విద్యా విధానం వల్ల విద్యార్థులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, జీవో 72 ఉత్తర్వులను రద్దుచేయడంతో పాటు, ప్రైవేటు కళాశాలల్లో పీజీ విద్యార్థులకు ఫీజు రీఇంబర్స్‌మెంట్‌ను వర్తింప జేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల మనుగడను తీవ్రంగా దెబ్బతీసిన జీవో 117ను రద్దు చేయాలన్నారు.ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ప్రసన్న, ఎ.అశోక్ మాట్లాడుతూ కోల్‌కతా మెడికల్ వైద్యురాలిపై జరిగిన హత్యాచారానికి నిరసనగా దేశవ్యాప్తంగా శనివారం వైద్యులు, వైద్య విద్యార్థులు జరప తలపెట్టిన బంద్‌కు ఎస్ఎఫ్ఐ సంపూర్ణ మద్దతునిస్తున్నట్టు వెల్లడించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు వి.ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

లో వోల్టేజ్.. కాలిన విద్యుత్ ఉపకరణాలు



తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 16: తాడేపల్లిగూడెం శేషమహల్ వెనుక భాగంలో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ లోపంతో ఇళ్లల్లోని విద్యుత్ ఉపకరణాలు కాలిపోయాయి. విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌లో వచ్చిన సాంకేతిక లోపంతో ఏసీలు, ఫ్రిడ్జ్‌లు, బల్బులతో పాటు ఉపకరణాలు కాలిపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విద్యుత్తు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

దత్తిరాజేరు, ఆగస్టు 16: గుర్తు తెలియని రైలు ఢీకొని ఒకరు మృతిచెందారు. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ బి.ఈశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం తెల్లవారుజామున బలిరెడ్డి సురేష్ (26) విజయనగరం జిల్లా పెదమానాపురం వద్ద పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడని తెలిపారు. మృతుడిది పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం అని తెలిపారు. తన నాయనమ్మ స్వగ్రామమైన పెదమానాపురం వచ్చినట్టు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజపతినగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.


ఏలూరులో భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే చంటి, మేయర్ నూర్జహాన్, అప్పలనాయుడు



ఏలూరులో అన్న క్యాంటీన్ వద్ద సందడి


తణుకులో కార్మికులతో కలిసి అల్పాహారం తింటున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

బాబూ..చల్లగుండయ్యా!


- పేదల కుడుపు నిండింది
- అన్న క్యాంటీన్లు ప్రారంభం
- రూ.5లకు అల్పాహారం, భోజనం
- ఎక్కడికక్కడ తరలివచ్చిన పేదలు
- కూటమి ప్రభుత్వానికి దీవెనలు

పేదోడి కడుపు నిండింది. శుక్రవారం వారి కల నెరవేరింది. తామెంతో ఆరాధించే ఆకలి తీర్చుకునే అన్న క్యాంటీన్లు మాయమైన ఐదేళ్ల తరువాత నేడు మళ్లీ తెరుచుకోవడంతో పేదల ఆనందానికి పట్టపగ్గాలు లేకుండా పోయింది. తొలిరోజే వెల్లువలా పేదలు ఎక్కడికక్కడ క్యాంటీన్లకు తరలివచ్చారు. అల్పాహారం, భోజనం భుజించి చంద్రబాబూ.. నువ్వు చల్లంగుండయ్యా.. అంటూ దీవించి మరీ వెళ్లారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)


భోజనం చేస్తున్న దివ్యాంగుడు

మితిమీరిన అహంకారం, అధికార పగ్గాలు చేపట్టామనే శృతిమించిన ధీమా, ఇంకొకరికి పేరొస్తుందనే అసూయ, ద్వేషంతో ఐదేళ్ల క్రితమే అధికార పగ్గాలు చేపట్టిన జగన్ ప్రభుత్వం అప్పట్లో అన్న క్యాంటీన్లను ఏకపక్షంగా మూసివేసింది. ప్రతీరోజూ ఈ క్యాంటీన్‌నే నమ్ముకుని నాలుగు మెతుకులు తింటున్న పేదోడి నోట్లో మట్టి కొట్టింది. స్థానిక నేతలు పేరు మార్చి అయినా సరే క్యాంటీన్ కొనసాగించాలని సంకేతాలు పంపినా కుదరనే కుదరదంటూ అప్పటి వైకో ప్రభుత్వం ఛీకొట్టింది. పేదల వర్గమంటూ జబ్బలు చరచుకునే నేతలంతా ఏ ఒక్కరూ క్యాంటీన్ తెరిపించలేపోయారు. జగన్ ప్రభుత్వాన్ని జనం సాగనంపిన వేళ.. తిరిగి పగ్గాలు అందుకున్న కూటమి ప్రభుత్వం పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లను శుక్రవారం నుంచి ఆరంభించింది.




ఏలూరు అన్న క్యాంటీన్‌లో భోజనాలు చేస్తున్న దృశ్యం

ఉదయం అల్పాహారంతో ప్రారంభం

కూటమి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఎక్కడా హడావుడి చేయకుండానే శుక్రవారం ఉదయం అల్పాహారంతో అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. ఏలూరు జిల్లావ్యాప్తంగా ఆరు అన్న క్యాంటీన్లను శుక్రవారం నుంచి ఆరంభించాలని అనుకున్నా తొలిరోజు మాత్రం ఒక్క జంగారెడ్డిగూడెం మినహా నూజివీడులో ఒకటి, ఏలూరులో మరో నాలుగు అన్న క్యాంటీన్లను ఆరంభించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెంలో క్యాంటీన్లు ప్రారంభమయ్యాయి. ఏలూరు నగరంలో కలెక్టరేట్, ఆర్‌ఆర్ పేట, తంగెళ్ళమూడి, బాలాజి థియేటర్ సమీపంలో శుక్రవారం నిర్ణీత సమయంలోనే ఉదయం 7 గంటల నుంచే అల్పాహారాన్ని ఆరంభించారు. ప్లేటు ఐదు రూపాయలు చొప్పున ఇడ్లీ, లేదా పూరిని తొలినాడు అందించగలిగారు. మధ్యాహ్నం వేళ అన్నం, కూర, పప్పు లేదా సాంబారు, పెరుగు, పచ్చడి వడ్డించారు. అన్నిచోట్ల అన్న క్యాంటీన్లన్నీ ఉదయం నుంచి రాత్రి వరకు నిర్ణీత సమయంలో కిక్కిరిసిపోయాయి.

రుచిగా, శుభ్రంగా ఉన్నాయి



అన్నా క్యాంటిన్‌లో ఈరోజు మధ్యాహ్నం భోజనం చేశాను. రుచిగానూ, శుభ్రంగానూ ఆహార పదార్థాలు ఉన్నాయి. బంగాళా దుంప, టమాట కుర్మా, నిమ్మకాయ పచ్చడి, సాంబారు, పెరుగుతో రూ. 5లకే భోజనం చేశాను. చాలా సంతృప్తిగా ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి పేదలు అందరూ రుణ పడి ఉంటారు.

-బొబ్బాసి శ్రీను, ప్లంబర్, పాలకొల్లు

రెండు పూటలా తినే అవకాశం వచ్చింది



ఈరోజు ఉదయం ఇడ్లీ, పూరి తీసుకున్నాను, సూపర్‌గా ఉంది. చట్నీ, కూర కూడా బాగున్నాయి. భార్య చనిపోవడంతో ఒంటరిగా ఉంటున్నాను. కుమార్తెలు ఇద్దరికి వివాహాలు చేశాను. చంద్రబాబు దయవల్ల రెండు పూటలా భోజనం చేసే అవకాశం మళ్లీ వచ్చింది. మహానుభావుడు మా.నిమ్మల రామానాయుడుకు రుణ పడి ఉంటాను.

-అప్పారావు, 21వ వార్డు పాలకొల్లు

వైసీపీ మా పొట్ట కొట్టింది..



కనీసం రెండుపూటలా కడుపు నింపుకునేందుకు గతంలో జేబులు చూసుకునేవాళ్లం. మళ్లీ అన్న క్యాంటీన్ ప్రారంభించడంతో మాకు ఆ పరిస్థితి ఉండదు. ఈ రోజు కడుపునిండా భోజనం చేశా. అన్న క్యాంటీన్లు సామాన్యులకు దేవాయాలు. వైసీపీ ప్రభుత్వం క్యాంటీన్లు మూసివేసి పొట్ట కొట్టింది. తిండి కోసం నానా అవస్థలు పడ్డాం.

- కె.మురళీ ,ఏలూరు

నిత్యం ఏలూరుకు జన తాకిడి

ఏలూరు నగరానికి ప్రతీరోజు వివిధ చికిత్సల నిమిత్తం, వ్యక్తిగత సమస్యల పరిష్కారం నిమిత్తం కార్యాలయాల్లో తగిన పనుల నిమిత్తం, చిన్నచితక వస్తువుల నిమిత్తం వేలాది మంది తరలివస్తారు. ఒకానొక అంచనా ప్రకారం ఏలూరు నగరానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే సంఖ్య రోజుకి 11 వేల నుంచి 17 వేల వరకు ఉంటుందని అంచనా. రద్దీగా ఉండే ఏలూరులో నాలుగు అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేశారు. నిత్యం వందలాది మంది అర్జీలు ఇచ్చే నిమిత్తం కలెక్టరేట్‌కు తరలివస్తూనే ఉంటారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అక్కడ కూడా అన్న క్యాంటీన్ ఆరంభించారు. అలాగే ఏలూరులో రద్దీ ప్రాంతం ఆర్‌ఆర్‌పేటలో, వ్యాపార సముదాయాల్లో పనిచేసే అల్పాదాయ గుమస్తాల సంఖ్య వందల్లోనే ఉంటుంది. వీరితోపాటు యాచకులు, కనీసం రోజూ ఒక ముద్దకు కూడా నోచుకోని అనాధలు, అభాగ్యులు మరెంతో మంది. వీరందరికీ కాస్త కడుపునింపే ప్రాంతం ఆర్‌ఆర్ పేటలోని అన్న క్యాంటీన్. దీంతోపాటు తంగెళ్ళమూడి, బాలాజీ థియేటర్ సెంటర్లలో క్యాంటీన్లు ఏర్పాటు చేశారు.

ఎక్కడికక్కడ కిక్కిరిశాయి

నూజివీడులో మంత్రి కొలుసు పార్థసారధి ప్రారంభించారు. ఉదయాన్నే అల్పాహారాన్ని మంత్రి స్వీకరించారు. పేదలకు కడుపు నింపడమే కాకుండా నాణ్యమైన ఆహారాన్ని అందించగలిగామనే సంతృప్తి తమ కూటమి ప్రభుత్వానికి కలుగుతుందన్నారు. పాలకొల్లు టాక్సీ స్టాండ్ సమీపంలో రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి డాక్టర్ నిమ్మల రామా నాయుడు ప్రారంభించారు. పేదవారికి రుచిగా, శుచిగా తక్కువ ధరలకే భోజనం అందిస్తుంటే జగన్ కడుపు మండుతోందన్నారు. ఏలూరులో కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే బడేటి చంటి క్యాంటీన్లను ప్రారంభించారు. పేదలతో కలిసి ఆహారం రుచి చూశారు.


తాడేపల్లిగూడెంలో అల్పాహారం స్వీకరిస్తున్న బొలిశెట్టి, బాబ్జి

పేదల కళ్లల్లో ఆనందం చూశాం : మంత్రి నిమ్మల

పాలకొల్లు అర్బన్ : రాష్ట్రంలో ఎంతోమంది పేదవారి కడుపులు నింపుతున్న అన్న క్యాంటీన్లను మూసి వేసి వైసీపీ ప్రభుత్వం వారి కడుపు కొట్టిందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లులో ఆయన అన్న క్యాంటీన్‌ను ప్రారంభించి మాట్లాడారు. జగన్ బ్రిటిష్ పాలకుల కన్నా కఠినమైన చట్టాలను అమలు చేసి ప్రతిపక్షాలను అణిచివేశారన్నారు. శుక్రవారం అన్న కాంటీన్లలో భోజనం చేసిన పేదల కళ్లల్లో ఆనందం చూశామన్నారు.

ప్రజల సంక్షేమమే మా బాధ్యత : మంత్రి పార్థసారధి

నూజివీడు : పేదల ఆకలిని తీర్చడమే అన్న క్యాంటీన్ల ఏర్పాటు లక్ష్యమని రాష్ట్ర గృహనిర్మాణసమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడులో అన్న క్యాంటీన్ ప్రారంభించారు. ప్రజలకు స్వయంగా అల్పాహారాన్ని అందించారు. ప్రజలను సంతోషపరిచేలా వారి ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలన అందించడం కూటమి ప్రభుత్వం బాధ్యత అన్నారు.

పేదల కళ్లల్లో ఆనందమే లక్ష్యం : ఆరిమిల్లి

తణుకు : పేదల కళ్ళల్లో ఆనందమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. తణుకు సొసైటీ రోడ్డులో అన్న క్యాంటీన్ ఆయన ప్రారంభించారు. పేదలకు ఆయన స్వయంగా అల్పాహారం వడ్డించారు. కార్మికులతో కలసి అల్పాహారం తిన్నారు. క్యాంటీన్ ద్వారా రోజు సుమారు 350 పైగా బోజనాలు, టిఫిన్‌లు చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. వైసీపీ ప్రభుత్వం క్యాంటీన్లు మూసివేసినా తణుకులో 450 రోజులుకు పైగా, అత్తిలిలో 550 రోజుల పాటు దాతల సహకారంతో దిగ్విజయంగా కొనసాగించిన టీడీపీ నాయకులు ఒమ్మి రాంబాబు, భీమనాదుని సుబ్బారావు, ఆనాల ఆదినారాయణ, ఆల్లి సత్య నారాయణలను ఆరిమిల్లి సాలువాలతో సత్కరించారు.

వైసీపీ మాజీ మంత్రులు క్యాంటీన్‌లో తినాలి : బొలిశెట్టి

తాడేపల్లిగూడెం అర్బన్ : అన్న క్యాంటీన్లపై విమర్శలు గుప్పించిన మాజీ మంత్రులు కొట్టు సత్యనారాయణ, అంబటి రాంబాబు తదితరులు క్యాంటీన్‌లో భోజనం చేసి అప్పుడు విమర్శలు చేయాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ చురకలు అంటించారు. టీడీపీ ఇన్‌చార్జి వలవల బాబ్జితో కలసి తాడేపల్లిగూడెంలో క్యాంటీన్ ప్రారంభించారు. తన పుట్టిన రోజు సందర్భంగా ఒక పూటకు అయ్యే భోజన ఖర్చును పట్టణ మున్సిపల్ ఇన్‌చార్జి కమీషనర్‌కు అందజేశానన్నారు. వలవల బాబ్జి మాట్లాడుతూ క్యాంటీన్లు తెరిచిన వెంటనే పేదల కళ్లల్లో ఆనందం కనపడుతోందన్నారు.

ఎంతో ఆనందంగా ఉంది : అంజిబాబు

భీమవరం టౌన్ : పేదలకు కడుపునిండా బోజనం పెట్టే ఈ గొప్ప కార్యక్రమాన్ని ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరంలో పాత బస్టాండ్ వద్ద అన్న క్యాంటీన్ కలెక్టర్ నాగరాణితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. బుధవారం మార్కెట్, పాత బస్టాండ్, జువ్వలపాలెం రోడ్డులో మూడు ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేశామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎనిమిది ప్రాంతాల్లో క్యాంటీన్లు ఏర్పాటు చేశామని వాటిలో మూడు క్యాంటీన్లను భీమవరంలో ప్రారంభించామన్నారు. మాజీ రాజ్యసభ సభ్యురాలు సీతారామలక్ష్మి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, జనసేన జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు, ఎమ్మెల్యే, కలెక్టరు ప్రజలకు అల్పాహారం వడ్డించి ఆహార పదార్థాలను రుచి చూశారు.

మొదటి నెల జీతం విరాళం : బడేటి చంటి

ఏలూరుటూ టౌన్ : పేదవాడికి పట్టెడన్నం పెట్టే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లు ప్రారంభించిందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, జనసేన ఇన్‌ఛార్జ్ రెడ్డి అప్పలనాయుడు నగర మేయర్ షేక్ నూర్జహాన్‌లు ఏలూరు నగరంలో క్యాంటీన్లు ప్రారంభించారు. ఆర్‌ఆర్ పేట వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద, తంగెళ్ళమూడి వంతెన, జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద, వన్‌టౌన్ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ హాలు వద్ద ప్రారంభించారు. పేదలకు స్వయంగా వడ్డించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నక్యాంటీన్లు నిర్వహణకు దాతల సహకారం అవసరమన్నారు.తన మొదటి నెల జీతం రూ.లక్షా 25 వేలు విరాళంగా ఇస్తున్నట్టు ప్రకటించారు.


భీమవరంలో వడ్డిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు, కలెక్టర్ తదితరులు

క్రైం కార్నర్

ఒంటరి జీవితంపై విరక్తి చెంది వృద్ధుడి ఆత్మహత్య

పెంటపాడు, ఆగస్టు 16 : ఒంటరి జీవితంపై విరక్తి చెందిన వృద్ధుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలివి. తాడేపల్లి గూడెం రూరల్ మండలం జగన్నాధపురానికి చెందిన కొయ్యినాడ నూకరాజు (71) భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భార్య ఆరేళ్ల క్రితం మృతి చెందింది. కుమార్తెలు ముగ్గురికి వివాహాలు కాగా, కుమారుడు ఇల్లు వదలి బయటకు వెళ్లిపోయాడు. దీంతో ఎవరూ లేని నూకరాజు కొన్ని రోజులు పట్టణంలోని పడాల వృద్ధాశ్రమంలో ఉన్నాడు. అయితే ఇటీవల 15 రోజుల నుంచి తనకు ఆరోగ్యం బాగోపోవడంతో చిన్న కుమార్తె ఇంటికి వెళ్ళాడు. అనంతరం గురువారం అక్కడి నుంచి తన సొంత ఊరు జగన్నాధపురం వెళ్ళి తన బంధువులను, గ్రామస్తులను పలకరించాడు. అదే రోజు అర్ధరాత్రి దాటిన తరువాత మండలంలోని ప్రత్తిపాడు బస్టాండ్ వద్ద ఉరి వేసుకుని మృతిచెందాడు. స్థానికులు సమాచారాన్ని అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ శంకర్ కేసు నమోదు చేశారు.

భార్య మరణంతో కలత చెంది ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఆగస్టు 16 : భార్య మరణంతో తీవ్ర కలత చెందిన ఒక వృద్ధుడు జీవితంపై విరక్తి చెంది రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు చాణుక్యపురి కాలనీ ఏటిగట్టు ప్రాంతానికి చెందిన దళాయి కృష్ణ (65)కు భార్య గత ఏడాది మేనెలలో మరణించింది. అప్పటి నుంచి కృష్ణ తీవ్ర మనస్థాపానికి గురై వంటరిగా ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం ఏలూరు శ్రీనివాస థియేటర్ సమీపంలో బ్రిడ్జిపైకి వెళ్ళి రైలు పట్టాలపై నిలబడ్డాడు. అదే సమయంలో కాకినాడ వెళ్ళే ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రైల్వే ఎస్ఐ సైమన్ సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా నమోదు చేసి మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై హత్యాయత్నం..భర్త అరెస్ట్

ఏలూరు క్రైం, ఆగస్టు 16 : భార్యపై తరచూ అనుమాన పడుతూ ఘర్షణ పడుతున్న భర్త అకస్మాత్తుగా చున్నీతో ఆమె మెడకు బిగించి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఏలూరులోని లంబాడీపేటనకు చెందిన బానోతు శివ ప్రసాద్ తన భార్య కనకదుర్గపై అనుమానం పెంచుకున్నాడు. గొడవలు కూడా జరుగుతున్నాయి. పోలీసులకు ఫిర్యాదు చేయగా కౌన్సెలింగ్ ఇచ్చారు. పెద్దల ద్వారా మాట్లాడుకున్నా అతని అనుమానం పెనుభూతం అవుతుందే తప్ప ఏ మాత్రం పోవడం లేదు. ఈ నెల 15వ తేదీన అకస్మాత్తుగా తన మెడకు చున్నీ చుట్టి హత్య చేయడానికి ప్రయత్నించాడు. ఇరుగు పొరుగు వారు చూసి ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ హత్య కేసు నమోదు చేసి శివ ప్రసాద్‌ను అరెస్టు చేశారు.

పాము కాటుతో రైతు మృతి

యలమంచిలి, ఆగస్టు 16: మండలంలోని శిరగాలపల్లి గ్రామానికి చెందిన సజ్జా నాగేశ్వరరావు (53) గురువారం రాత్రి పాము కాటు వేయడంతో మృతి చెందారు. నాగేశ్వరరావు గురువారం సాయంత్రం పొలం వెళ్లి పాలు తీసుకొని ఇంటి వద్దకు వచ్చి బయటకు వెళ్ళాడు. రాత్రి 9 గంటల అయినప్పటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయడం లేదు. దీంతో బంధువులు గ్రామంలోని నాగేశ్వరరావు ఆచూకీ కోసం గాలించిన అనంతరం పొలం వెళ్లి చూడగా కొబ్బరి తోటలో నోటి వెంట నురగలు వచ్చి విగత జీవిగా పడి ఉన్నాడు. మృతుని కాలుపై పాము గాటు ఉండటంతో పాము కరిచి ఉంటుందని భావిస్తున్నారు.

రోడ్డు పక్కన పడి వ్యక్తి మృతి

భీమవరం క్రైం, ఆగస్టు 16 : మద్యం మత్తులో రోడ్డు పక్కన పడి తలకు గాయాలవగా చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. భీమవరం వన్‌టౌన్ ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలివి.. మొగల్తూరు మండలం కాళీపట్నంకు చెందిన మర్రి భద్రయ్య (60) చేల్లో ఎలుకలు, చేపలు పట్టుకుని జీవిస్తుంటాడు. ఈనెల 12న ఇంటి నుంచి బయటకు వచ్చి అతిగా మద్యం సేవించి దిరుసుమర్రు రోడ్డులో పక్కన పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 సాయంతో భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈనెల 14వ తేదీ రాత్రి మృతి చెందాడు. అతడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ తెలిపారు.

పోలీసుల టార్చర్ భరించలేకపోతున్నా..

యువకుడి ఆత్మహత్య.. వైరల్ అవుతున్న సెల్ఫీ వీడియో


ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు

ద్వారకాతిరుమల ఆగస్టు 16 : ద్వారకా తిరుమలలో ఒక యువకుడు ఆత్మహత్య చేసకున్నాడు. ఆత్మహత్యకు ముందు అతను తీసుకున్న సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ద్వారకాతిరుమలకు చెందిన పెండ్రాల పోశిబాబు (28) గురువారం రాత్రి కొంగల మందు తిని ఆత్మహత్య చేసుకున్నాడు. తన ఆత్మహత్యకు గల కారణాన్ని సోషల్ మీడియా ద్వారా తెలియపరిచాడు. ఈ వీడియో ప్రసార మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. పోలీసుల టార్చర్ భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పాడు. పుట్టి పెరిగిన నాటి నుంచి పోలీస్ స్టేషన్ గడప తొక్కలేదని పోలీసులు శారీరకంగా మానసికంగా చిత్ర హింసలకు గురి చేశారని, తనను పోలీస్ స్టేషన్‌కి రమ్మంటూ ఇబ్బందులు పెడుతున్నారని కుటుంబ సభ్యుల ముందు తలెత్తుకోలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇదిలా ఉంటే ఆ యువకుడు గ్రామానికి చెందిన ఒక మైనర్ బాలికను వేదిస్తున్నాడని గ్రామానికి చెందిన ఆ బాలిక తల్లి నాలుగు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయంపై అతడిని పిలిచి పోలీసులు మందలించినట్లు తెలిసింది. మృతుడికి ఒక భార్య, మూడు సంవత్సరాల పాప ఉంది. భార్య గర్భిణి కావడంతో ఏలూరు ఆస్పత్రిలో ఉంది.

భర్తను కడతేర్చిన భార్య

పెదనింద్రకొలనులో సంఘటన


ఏనుగుపల్లి శ్రీను మృతదేహం

నిడమర్రు ఆగస్టు 16 : భర్త వేధింపులకు తట్టుకోలేక కట్టుకొన్న భార్యే భర్తను కడతేర్చిన సంఘటన పెదనింద్రకొలనులో చోటు చేసుకొంది. తాగుడుకు బానిసై దొరికినచోటల్లా అప్పులు చేసి కుటుంబాన్ని రోడ్డున పడేస్తున్న కట్టుకొన్న మొగుడు తనపై దాడి చేస్తుంటే చివరకు అతడినే హతమార్చింది. నిడమర్రు ఎస్ఐ వీరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం నిడమర్రు మండలం పెదనింద్రకొలను గ్రామంలో వైఎస్ఆర్ కాలనీ ఎస్సీ కాలనీలో భార్య భర్తలు నివసిస్తున్నారు. వీరి ఒక కుమార్తె ఉంది. ఆమెకు ఆరునెలల క్రితం వివాహం చేశారు. పెళ్లయిన నాటి నుంచి వారు గొడవలు పడుతున్నారు. శుక్రవారం భార్యభర్తలు ఘర్షణ పడ్డారు. భర్త ఏను గుపల్లి శ్రీను (36) అక్కడే గల గునపం తీసుకొని ఆవేశంలో తాము నివాసం ఉంటున్న రేకుల షెడ్డును కూల్చబోగా భార్య ఝూన్సీరాణి (32) అడ్డువెళ్లి ఆపబోయింది. తనపై గునపంతో దాడి చేయబోయిన భర్త నుంచి గునపం లాక్కొని తిరిగి అతని తలపై బలంగా బాదడంతో శ్రీను అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. భర్తను కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ అతను అప్పటికే చనిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని శ్రీను మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్టు పోలీసులు తెలిపారు.


సీఎం చంద్రబాబు నుంచి ల్యాప్‌టాప్ అందుకుంటున్న సూర్య తేజశ్రీ

ఆంధ్ర నుంచి అమెరికా

మిషిగన్‌లో ఏడాది డిప్లొమా కోర్సుకు జంగారెడ్డిగూడెం విద్యార్థిని సూర్యతేజశ్రీ ఎంపిక

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 16: అమెరికాలో ఏడాది పాటు ఉచిత విద్య అభ్యసించే అవకాశం జంగారెడ్డిగూడెం బాలిక సూర్యతేజశ్రీ దక్కించుకుంది. మంత్రి నారా లోకేశ్ సహకారంతో సీఎం నుంచి రూ.లక్ష నగదు, ల్యాప్‌టాప్ సూర్య తేజశ్రీ అందుకుంది. అమెరికాలో మిషిగన్ రాష్ట్రంలో హోప్కిన్‌లో ఏడాది పాటు డిప్లొమో కోర్సు చేయనుంది పట్టణానికి చెందిన 17 ఏళ్ల బందిల సూర్య తేజశ్రీ. కెన్నడి లూగర్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌లో భాగంగా గత ఏడాది 12 విభాగాల్లో అమెరికా ఫీల్డ్ సర్వీస్ సంస్థ (ఏఎఫ్ఎస్) ద్వారా నిర్వహించే ఆన్‌లైన్ టెస్టుల్లో సూర్యతేజశ్రీ ప్రతిభ కబరిచింది. ఏడాది పాటు నచ్చిన కోర్సులో ఉచిత శిక్షణతో పాటు అక్కడ ఏపీ ప్రతినిధులుగా వ్యవహరిస్తారు. అమెరికాకు ప్రయాణ కర్చులు కూడా ఆ సంస్థ భరిస్తుందని, ఈ నెల 18న అమెరికా వెళ్లనున్నట్లు సూర్యతేజశ్రీ చెప్పింది. మన సంస్కృతి సంప్రదాయాలపై అమెరికాలో ఏడాది పాటు నిర్వహించే యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ కోసం దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు పోటీపడగా దేశవ్యాప్తంగా కేవలం 30మంది మాత్రమే ఎంపికయ్యారు. ఏపీ నుంచి తనతోపాటు రాజమండ్రికి చెందిన దీప్తీశ్రీ ఎంపికైనట్లు సూర్యతేజశ్రీ తెలిపింది.

మంత్రి నారా లోకేశ్ ఆర్థిక భరోసా

సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఆర్థిక చేయూతను మర్చిపోలేమని సూర్యతేజశ్రీ తల్లి నాగమణి తెలిపారు. ప్రజాదర్బార్‌లో ఇచ్చిన వినతి ద్వారా విషయం తెలుసుకుని సీఎం చంద్రబాబు సెక్రటేరియట్‌కు పిలిపించి అభినందనలు తెలిపారు. ప్రతిభ గల విద్యార్థులు ఎక్కడ ఉన్నా కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. తమ ఆర్థిక పరిస్థితిని తెలుసుకుని చేయూత ఇచ్చిన తండ్రి కొడుకులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. చింతలపూడి ఎమ్మెల్యే రోషన్‌కుమార్, ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ సూర్యతేజశ్రీని అభినందించారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాక్షించారు.


సమావేశంలో నల్లబ్యాడ్జీలతో పీఎంపీ సభ్యుల నిరసన

వైద్యురాలిపై హత్యాచార సంఘటనపై పీఎంపీల నిరసన

భీమడోలు, ఆగస్టు 16: కోల్‌కత్తా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యురాలిపై హత్యాచార సంఘటనను భీమడోలు పారామెడిక్స్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్ వెల్ఫేర్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. భీమడోలులో శుక్రవారం పీఎంపీ వెల్ఫేర్ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. వైద్యురాలికి ఆసుపత్రిలోనే రక్షణ లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక చట్టాలను తీసుకురావాలని జిల్లా కార్యదర్శి ఎం.జయరామ్ డిమాండ్ చేశారు. వైద్యురాలి ఆత్మకు శాంతి కలగాలంటూ మౌనం పాటించారు. 17న నల్ల బ్యాడ్జీలు ధరించి ఫస్ట్‌ఎయిడ్ సర్వీసులు నిలుపుదల చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తెలిపే విధంగా తీర్మానించారు. మండల కన్వీనర్ రంజాన్‌వలి, కో కన్వీనర్ పల్లారావు, సభ్యులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి కృషి : ఎస్పీ కిశోర్


భవనం ప్రారంభిస్తున్న ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, ఆగస్టు 16: పోలీస్ సిబ్బంది సంక్షేమానికి సహకరిస్తానని ఎస్పీ కేపీఎస్ కిశోర్ అన్నారు. పోలీస్ సహకార సంఘ భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. పోలీస్ సభ్యులందరికీ క్రమ పద్ధతిలో రుణాలను మంజూరు చేస్తామన్నారు. ప్రతి నెల జీతం నుంచి మినహాయింపు ఉంటుందన్నారు. తమకు కూడా రుణాలు మంజూరు చేయాలని జిల్లా హోంగార్డ్స్ ఎస్పీని కోరగా సానుకూలంగా స్పందించారు. ఏఎస్పీ జి స్వరూప రాణి, ఎస్ఈబి ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, ఏఆర్ ఏఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, ఏపీ పోలీస్ హౌసింగ్ బోర్డు డీఈ షేక్ అబ్దుల్ ఖాదీర్, డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీహరి, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, టూటౌన్ సీఐ ఎం ప్రభాకర్, త్రి టౌన్ సీఐ కె శ్రీనివాసరావు, తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణపై అప్రమత్తంగా ఉండాలి


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

లింగపాలెం, ఆగస్టు 16: ఆరోగ్య పరిరక్షణపై అప్రమత్తంగా ఉండాలని కె.గోకవరం పీహెచ్‌సీ డాక్టర్ కృష్ణకిశోర్ అన్నారు. ఒడిచర్ల గ్రామంలో శుక్రవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలుతున్న సమయంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వాతావరణ పరిస్థితులు మారుతుండటంతో జ్వరం, మలేరియా, డెంగీ విజృంభిస్తున్నాయని, ప్రజలు వాటిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఇళ్లలో మురుగునీరు నిల్వకుండా చూసుకోవాలని, దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని తెలిపారు. ఎటువంటి అనారోగ్య సమస్యలు ఎదురైనా వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని కోరారు. హెచ్‌వి రాణి, ఎంఎల్‌హెచ్‌వి రోజా, హెల్త్ అసిస్టెంట్ చంద్రశేఖర్, ఏఎన్ఎం పద్మ, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: వర్షాల సీజన్‌లో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు అన్నారు. శ్రీపర్రు, మానూరు, గుడివాకలంకలో శుక్రవారం ఫ్రైడే‌డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. సిబ్బంది ఉమామహేశ్వరరావు, శేషావతారం, శ్రీనివాసరావు, ప్రమీలారాణి పాల్గొన్నారు.

మాలల జేఏసీ ఆధ్వర్యంలో మహాధర్నా


చింతలపూడి పాత బస్టాండు వద్ద ధర్నా

చింతలపూడి, ఆగస్టు 16: స్థానిక పాత బస్టాండు అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాలల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం మహాధర్నా నిర్వహించారు. దళిత నాయకులు మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, సుప్రీం తీర్పును రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో నాయకులు పిట్టా వేణు, కాకర్ల సత్యనారాయణ, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, బాబు, రాజు, మానేపల్లి రాజారావు, జయపాల్, రాజారత్నం, మహాలక్ష్మణుడు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సబ్సిడీపై రుణాలు ఇవ్వాలి : దళితసేన

చింతలపూడి, ఆగస్టు 16: అర్హులైన ఎస్సీ, బీసీ, బడుగు వర్గాల వారికి సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని దళితసేన వ్యవస్థాపక అధ్యక్షులు జుజ్జువరపు రవి ప్రకాష్ డిమాండ్ చేశారు. చింతలపూడిలో జరిగిన జిల్లా కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రుణాల కోసం ఎదురు చూస్తున్నామన్నారు. లిడ్‌క్యాప్ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేలన్నారు. ఈదియా, దేవమాత, కార్తీక్, మంగ, తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై సోలార్ విద్యుదుత్పత్తి పరికరాలు

పోలవరం ఆగస్టు 16: మండలంలో విద్యుత్ వినియోగదారులకు 40 శాతం రాయితీపై విద్యుత్ ఉత్పత్తి పరికరాలు అందించనున్నట్లు శుక్రవారం ఏపీ ట్రాన్స్‌కో ఏఈ కె.సత్యనారాయణ తెలిపారు. గతంలో తెల్ల రేషన్ కార్డుదారులకు మాత్రమే రాయితీ వర్తించేదని, ఇప్పుడు ప్రతి ఒక్కరికి సబ్సిడీ వర్తిస్తుందని ఏఈ తెలిపారు. 1 కిలోవాట్స్ రూ.65 వేల నుంచి రూ.70 వేలు ఉంటుందన్నారు. మిగులు విద్యుత్ ట్రాన్స్‌కో తీసుకుని సొమ్ము చెల్లిస్తుందని తెలిపారు.


చింతలపూడి ఏరియా ఆసుపత్రిలో జ్వర బాధితులు

ఇంటింటా జ్వరం

వణుకుతున్న చింతలపూడి

చింతలపూడి, ఆగస్టు 16: పట్టణం, పరిసర గ్రామాల్లో ఏ ఇంటి తలుపు తట్టినా జ్వరాలతో వణుకుతున్నారు. నిలబడలేం, కూర్చోలేం, ఒళ్లంతా నొప్పులు, కాళ్ల వాపులు, గొంతు తడిఆరిపోవడం, నీరసం, ఒకోసారి చలిజ్వరం, అంటూ పలువురు బాధితులు వాపోతున్నారు. 15రోజులు దాటినా ఈ లక్షణాలే పట్టిపీడిస్తున్నాయని జ్వరాల బారిన పడినవారు చెబుతున్నారు. రోజులో ఏదొక సమయంలో నడన్‌గా నీరసంతో కొంతసేపు విశ్రాంతి తీసుకోవాల్సి వస్తుందని, తర్వాత నొప్పులతో బాధపడుతున్నా వారు అధికం. 40 ఏళ్ల వయసు దాటిన వారిలో అధికంగా జ్వరాలు వస్తున్నాయని చెబుతున్నారు. మందులు, ఇంజక్షన్లు వాడినా జ్వరతీవ్రత తగ్గినా విపరీతమైన నీరసంతో బాధపడుతున్నామని, నిలబడడం, నడవడం కూడా భారంగా ఉంటోందని పలువురు చెబుతున్నారు. జ్వరాల బారిన పడినవారు పండ్ల రసాలు, పండ్లు, బొప్పాయి వంటివి తీసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇంట్లో ఒకరికి వచ్చిందంటే ఇంటిల్లపాది జ్వరాల బారిన పడుతున్నామని చెబుతున్నారు. పట్టణ పరిసర ప్రాంతాల్లో వైద్య సౌకర్యాలు తక్కువ. చింతలపూడి పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో 30 బెడ్లు మాత్రమే ఉండడంతో ఎప్పుడూ పేషెంట్లతో నిండి ఉంటున్నాయి. ఒకోసారి ఒకే బెడ్‌పై ఇద్దరు పేషెంట్లను ఉంచాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రైవేట్ ఆసుపత్రులు కూడా తక్కువ కావడంతో చాలామంది పీఎంపీలను ఆశ్రయిస్తున్నారు. కొంతమంది రోగులు నేరుగా రక్తపరీక్షల కోసం తిరుగుతున్నారు. పరిసర గ్రామాల్లోని రోగులు జంగారెడ్డిగూడెం, ఏలూరు, సత్తుపల్లి ప్రాంతాలకు వెళ్లి వైద్యసేవలు పొందుతున్నారు. చింతలపూడి పట్టణంలో ప్రతి వీధిలో డ్రైనేజి సమస్యలు, దోమలు బెడద ఉన్నాయి. ప్రధాన రహదారి పై దుమ్ము కాలుష్యం బాధిస్తోంది. రోడ్డుపై చెత్త వాహనాల కింద నలిగి మార్కెట్‌కు వచ్చే ప్రజలకు దుమ్ముకాలుష్యాన్ని తీసుకువస్తున్నాయి.

అవి వైరల్ జ్వరాలే



పట్టణ పరిసర ప్రాంతాల్లో 20 రోజుల నుంచి వైరల్ జ్వరాలు తీవ్రంగా ఉన్నాయి. ఇప్పుడిప్పుడే తగ్గుముఖం పడుతున్నాయి. జ్వర తీవ్రత కంటే ఒంటినొప్పులు, వాపులు ఈ లక్షణాలు వైరల్ జ్వరాలకు చెందినవే. ఇంటి పరిసరాల్లో పరిశుభ్రత, పొడి వాతావరణం వంటి జాగ్రత్తలతో కొంతవరకు అదుపు చేయవచ్చు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి. దోమ తెరలు ఉపయోగించడం, జ్వరాల బారిన పడిన వారు కాచిచల్లార్చిన నీరు తాగాలి. డీ హైడ్రేషన్‌కు గురి కాకుండా నీరు, పండ్ల రసాలు ఎక్కువ తీసుకోవాలి. వీటితో పాటు జ్వరాల లక్షణాలు కనిపించగానే డాక్టర్‌ను సంప్రదించడం మంచిది.

- కిరణ్ చైతన్య, పీహెచ్‌సీ వైద్యాధికారి, రాఘవాపురం


శాకంబరిగా కుంకుళ్లమ్మ, ఏలూరులో పట్టుచీరలు, నగదు అలంకరణలో అంబికాదేవి, లక్ష్మీదేవి, చేబ్రోలులో గాయత్రి దేవి, కె.కోట లలితా పీఠంలో అమ్మవారు, పోలవరంలో వాసవీమాత, అచ్చమ్మ పేరంటాలు ఆలయంలో చింతమనేని రాధారాణి

శ్రావణ శోభ

వరలక్ష్మి వత్రం.. అమ్మవారికి ప్రత్యేక పూజలు

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 16: శ్రావణ మాసం పౌర్ణమికి ముందు శుక్రవారం వరలక్ష్మి వ్రతం ఆచరిస్తారు. నగరంలో అమ్మవారి ఆలయాల వద్ద మహిళలు శుక్రవారం వరలక్ష్మి వ్రతం చేశారు. నగరంలో అంబికాదేవిని 108 పట్టు చీరలతో అలంకరించారు. పత్తేబాద కనకదుర్గమ్మను రూ.లక్ష నగదుతో అలంకరించారు. సత్రంపాడు సౌభాగ్యలక్ష్మీదేవి గజలక్ష్మి, బావిశెట్టి వారిపేట కనకదుర్గాంబ ధనలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. దక్షిణపువీధిలో బాల త్రిపుర సుందరి, మహిషాసుర మర్దినిదేవి, అగ్రహారం జ్ఞాన సరస్వతి, కన్యకాపరమేశ్వరి, రాజ్యలక్ష్మి అమ్మవార్లకు మహిళలు విశేష పూజలు చేశారు.

● ద్వారకాతిరుమల: క్షేత్రదేవత కుంకుళ్లమ్మ శుక్రవారం శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆలయాన్ని మామిడి తోరణాలతో అలకంరించారు. అమ్మవారిని వివిధ రకాల పండ్లు, కూరగాయలతో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● దెందులూరు: గాలాయగూడెం అచ్చమ్మ పేరంటలను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సతీమణి చింతమనేని రాధారాణి దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, బోనాలను, పట్టువస్త్రాలను సమర్పించారు. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది.

● చింతలపూడి: మండలంలో వరలక్ష్మి వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి పాయసం, పిండివంటలు నైవేద్యం సమర్పించారు. పువ్వులు, చీర, పసుపు, కుంకుమ, గంధం, గాజులతో అమ్మవార్లను అలంకరించారు. అమ్మవారికి నమస్కరించి దీవెనలు పొందారు.

● కుక్కునూరు: శ్రావణ మాసం రెండవ శుక్రవారాన్ని పురస్కరించుకుని వరలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయంలో అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరణ, పూజలు నిర్వహించారు. అనంతరం పలు చోట్ల అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.

● పెదపాడు: వట్లూరులో కనకదుర్గమ్మ, సౌభాగ్యలక్ష్మిదేవి ఆలయం, కొత్తూరు, వసంతవాడ గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాల్లో శుక్రవారం విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మహిళలు అమ్మవార్లను దర్శించుకుని చీర, సారె, గాజులు సమర్పించి పూజలు నిర్వహించారు.

● జీలుగుమిల్లి: గ్రామ దేవత జగదాంబకు ప్రత్యేక అలంకరణ చేశారు. మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో సాయంత్రం పంచహారతులతో పూజలు చేశారు.

● ఉంగుటూరు: మండలంలో అమ్మవార్ల ఆలయాల్లో వరలక్ష్మి వ్రతాలు, విశేష పూజలు, అలంకరణలు చేశారు. ఇంటింటా మహిళలు వ్రతాలు నిర్వహించి వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. చేబ్రోలు సాయి గాయత్రి ఆలయంలో అమ్మవారికి పంచామృతాభిషేకం చేశారు.

● నిడమర్రు: మహిళలు వరలక్ష్మి వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ఇళ్ల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆలయాల్లో పూజలు చేశారు. భువనపల్లి, నిడమర్రు, పెదనింద్రకొలను, చానమిల్లి, అడవికొలను, బావాయిపాలెం దుర్గాదేవి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

● కామవరపుకోట: లక్ష్మీ హయగ్రీవ లలితాశ్రీ పీఠంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, అర్చనలు, కుంకుమార్చనలు జరిపి వరలక్ష్మి వ్రతాలు ఆచరించారు. సుదర్శనం రామదుర్గ కుమారాచార్యులు, సత్య శ్రీనివాసాచార్యులు భక్తులతో పూజలు చేయించారు.

● పోలవరం: మండలంలో అమ్మవారి ఆలయాలలో వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. పోలవరం వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. ఏటిగట్టు సెంటర్, నూతనగూడెం, కృష్ణారావుపేట, బంగారమ్మపేట, పాత పట్టిసీమ, కొత్త పట్టిసీమ, గూటాల, వింజరం, ఎల్ఎన్‌డీ పేట కనకదుర్గ ఆలయాలు, పట్టిసీమ మంగళ చండికా దుర్గాదేవి, ప్రగడపల్లి పోశమ్మ, వెంకటాపురం ముత్యాలమ్మ, పాశాలమ్మ, ఆలయాలలో ప్రత్యేక పూజలు, వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అర్చకులు వేదపండితులు పైడిపల్లి ఫణికుమార్ శర్మ, ర్యాలి చంద్రశేఖర్, ర్యాలి ప్రసాద్, రాంబాబు మహిళా భక్తులు పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: మండలంలోని అమ్మవారి ఆలయాలు, ఇళ్ల వద్ద వరలక్ష్మివ్రతం నిర్వహించారు. మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. కంచి కామక్షి విశ్వబ్రహ్మణ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరా, జాకెట్లు పంపిణీ చేశారు. 50మంది మహిళలకు చీరలు పంపిణీ చేసినట్లు సంఘ గౌరవ అధ్యక్షులు దాసరాజు శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘ సభ్యులు పాల్గొన్నారు.


అచ్చియ్యపాలెంలో గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బాలరాజు


తల్లాపురంలో అంగన్వాడీ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ధర్మరాజు

గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం, ఆగస్టు 16: అచ్చియ్యపాలెంలో గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. శుక్రవారం ఆయన గ్రామాన్ని సందర్శించి గిరిజనుల సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలో వాటర్ ట్యాంకు, ఇళ్ల నిర్మాణాలు కావాలని గిరిజనులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. గ్రామాల్లో సమస్యలపై ప్రత్యేకంగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: ఉపాధి హామీ పథకం, ఐసీడీఎస్, జడ్పీ నిధులు సుమారు రూ.9.50 లక్షలతో నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ప్రారంభించారు. గ్రామస్థులు కలిసికట్టుగా అభివృద్ధికి పాటు పడాలన్నారు. సర్పంచ్ పసుపులేటి నరసింహారావు, తహసీల్దార్ సతీష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారదామణి, పంది రాంబాబు, రాందే రాజారావు, పాతూరి విజయకుమార్, కడియాల రవిశంకర్ పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులపై కేసులు ఉపసంహరించాలి

ఏలూరు అర్బన్, ఆగస్టు 16: గత వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులపై బనాయించిన కేసులను ఉపసంహరించాలని ఏపీ ప్రభుత్వోద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సంఘ గుర్తింపు దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథులు ఎల్.విద్యాసాగర్, రాంబాబు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు రాము, కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ మధ్యంతర భృతిని ప్రకటించాలని, పీఆర్సీని వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు ఎస్.అప్పారావు, శ్రీనివాసరావు, గోపీకృష్ణ, ఉస్మాన్, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

కాపు సంక్షేమసేన జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్

ఏలూరు రూరల్, ఆగస్టు 16: కాపు, బలిజ సంక్షేమసేన జిల్లా అధ్యక్షుడిగా కుప్పాల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన ఆత్మీయ సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా జిల్లా హరికృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఎడ్లపల్లి ప్రసాద్, జిల్లా రైతు అధ్యక్షుడిగా నాగం శివ, కార్యదర్శిగా కె.వేణుగోపాల్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నాయుడు, సహాయ కార్యదర్శిగా గాదె రాంబాబు, జిల్లా యూత్ అధ్యక్షుడిగా నగిరెడ్డి కాశీనరేష్, భీమడోలు మండల కన్వీనర్‌గా జనార్ధన్‌రావు, జిల్లా మహిళా కార్యదర్శిగా కె.తేజశ్విని ఎన్నుకున్నారు. ఏడు నియోజకవర్గాల కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలి

దెందులూరు, ఆగస్టు 16: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలకు గ్రామ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సుమలత సూచించారు. ఎంపీపీ సుమలత అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్ సమావేశం జరిగింది. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉపాధి, పారిశుధ్యం నిర్వహణ, తాగు నీరు సమస్యలు వివరించారు. తహసీల్దార్, మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు

రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 16: గ్రామ రెవెన్యూ సదస్సులు కేవలం గ్రామాల్లోనే కాకుండా పట్టణాల్లో కూడా నిర్వహించి భూ సమస్యలు పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం డిమాండ్ చేశారు. స్థానిక పవరుపేట సీపీఎం కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యుల సమావేశం తెల్లం రామకృష్ణ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సీతారాం మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. వాటిని కూడా పరిష్కరించాలని చెప్పారు. కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు, వడ్డీలేని పంట రుణాలు ఇవ్వాలన్నారు. ఆర్.లింగరాజు, డి.ఎన్.వి.డి.ప్రసాద్, జి.రాజు, పి.కిషోర్, ఎం.నాగమణితోపాటు వివిధ మండలాల నుంచి వచ్చిన సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగుల చట్టాన్ని అమలు చేయాలి

లింగపాలెం, ఆగస్టు 16: దివ్యాంగుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని దివ్యాంగ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు జయరాజు కోరారు. లింగపాలెంలో శుక్రవారం దివ్యాంగులతో సమావేశం ఏర్పాటు చేశారు. మండల కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా కమ్మకూరి ముత్తమ్మను ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. అనంతరం తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మండల కన్వీనర్ కాటూరి వెంకటసత్యనారాయణ పాల్గొన్నారు.

వైసీపీకి వగ్వాల అచ్యుత రామారావు రాజీనామా

భీమడోలు, ఆగస్టు 16: గుండుగొలనుకు చెందిన వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వగ్వాల అచ్యుతరామారావు ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన రాజీనామా చేసినట్లు ప్రకటించారు. వైసీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీకి సేవలందించారు. పార్టీ వ్యవహారశైలిపై అసంతృప్తి చెందిన ఆయన పార్టీ పదవికి, సభ్యత్వానికి రాజీనామా చేసి పార్టీ కార్యాలయానికి ఫ్యాక్స్ పంపినట్లు తెలిపారు.


కుక్కునూరులో రహదారి మరమ్మతు చేయించిన టీడీపీ నాయకులు


దొరమామిడి సీసీ రోడ్డును బాగుచేసుకున్న కొండరెడ్లు

సొంత ఖర్చుతో రహదారి మరమ్మతులు

కుక్కునూరు, ఆగస్టు 16: కుక్కునూరు మండల కేంద్రంలో రహదారులు అధ్వానంగా మారాయి. రహదారికి రూ.40కోట్లు మంజూరైనప్పటికి సాంకేతిక సమస్య వలన పనులు నిలిచిపోయాయి. ప్రజలు ఇబ్బందులు గమనించి టీడీపీ మండల అధ్యక్షుడు మునిశెట్టి నాగేశ్వరరావు రహదారి మరమ్మతు చేయించారు. తాత్కాలిక మరమ్మతు చేపడుతున్నామని, పూర్తి స్థాయిలో రహదారి నిర్మిస్తామని ములిశెట్టి నాగేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ పిచ్చుక రాజు, శ్రీను, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: ఏజెన్సీలో కురిసిన భారీవర్షాలకు అలివేరు-దొరమామిడి గ్రామాల మధ్య సీసీ రోడ్డు కొట్టుకుపోయింది. అత్యవసర సమయాల్లో బయట ప్రాంతాలకు వెళ్లడానికి మార్గం లేకపోవడంతో శుక్రవారం ఎంపీటీసీ కొవ్వాసు గోవిందరాజు, ఉప సర్పంచ్ చింతల కృష్ణ ఆధ్వర్యంలో కొట్టుకుపోయిన సీసీ రోడ్డును మట్టి, రాళ్లతో కప్పి కొండరెడ్లు తాత్కాలిక మరమ్మతు చేసుకున్నారు. ఏజెన్సీ వ్యాప్తంగా కొట్టుకుపోయిన రహదారులను ఐటీడీఏ అధికారులు బాగుచేయాలని ఆదివాసీలు కోరుతున్నారు.

ఉత్తమ సేవలకు అవార్డు అందుకున్న కొండలరావు


అవార్డు అందుకుంటున్న ఎంఈ కొండలరావు

ఏలూరు టూటౌన్, ఆగస్టు 16: ఉత్తమ సేవలు అందించిన నగర పాలక సంస్థ మున్సిపల్ ఇంజనీర్ పిలగల కొండలరావు మంత్రి కె.పార్థసారధి నుంచి అవార్డు అందుకున్నారు. స్వాతంత్ర్య వేడుకల్లో వేడుకల్లో కొండలరావు ఈ అవార్డు అందుకున్నారు. పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

వట్లూరువాసికి శౌర్య పతకం



పెదపాడు, ఆగస్టు 16: విధి నిర్వహణలో ప్రతిభకనబర్చిన వట్లూరు గ్రామ పంచాయతీ సీతారాంపురానికి చెందిన బలగంశెట్టి భాస్కరరావును శౌర్య పతకం అందుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నుంచి పతకాన్ని అందుకున్నారు. రాష్ట్రస్థాయిలో శౌర్య పతకాన్ని అందుకున్న బలగంశెట్టి భాస్కరరావును పలువురు ప్రముఖులతో పాటుగా వట్లూరు గ్రామస్తులు అభినందించారు.

గుణ్ణం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రక్తదానం

ఉంగుటూరు, ఆగస్టు 16: నారాయణపురం మాజీ సర్పంచ్ గుణ్ణం రామచంద్రరావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. 45 మంది యువకులు రక్తదానం చేశారు. నారాయణపురం సబ్ సెంటర్‌లో ఆశ వర్కర్లకు గొడుగులు, వాటర్‌బాటిల్స్, ఎయిడ్స్ బాధితులకు మందులు, ప్రొటీన్ ఫుడ్, చేబ్రోలు అనాథశ్రమం పిల్లలకు బియ్యం, నిత్యావసరాలు అందించారు. మొక్కలు నాటారు. దిడ్ల శ్రీను, గుణ్ణం రుషి, వెజ్జు సుబ్బారావు, నల్లా ఆనంద్, యువరాజు, గాది వెంకట రమణ, గోలి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **బుట్టాయగూడెం :** గుబ్బల మంగమ్మ దర్శనానికి వచ్చే భక్తులు త్వరగా దర్శనాలను ముగించుకుని వెళ్లాలని ఆలయ కమిటీ సభ్యులు సూచించారు. సూచనలను భక్తులు తప్పకుండా పాటించాలన్నారు.
- **కామవరపుకోట :** వ్యాపార వేత్త, ఆర్యవైశ్య నాయకులు కొండూరు సురేష్ శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మైక్రోస్కోప్ పరికరాన్ని ప్రిన్సిపల్ విజయబాబుకు అందజేశారు.
- **లింగపాలెం :** సర్దార్ సర్వాయిపాపన్నగౌడ్ విగ్రహావిష్కరణకు గౌడన్నలతో పాటు ప్రజలు హాజరుకావాలని గౌడసంఘం మండల నేతలు కోరారు. ఈనెల 18న విగ్రహావిష్కరణ జరుగుతుందన్నారు.
- రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మోరంపూడి మల్లికార్జునరావు అన్నారు. తహసీల్దార్ ఎమ్డీ నజీముల్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. చెన్నుశ్రీనివాస్‌యాదవ్, తాతిన రాధాకృష్ణ, పల్లి శ్రీను, అసిలేటి అజయ్, రవికుమార్, పలువురు నేతలు పాల్గొన్నారు.
- **దెందులూరు :** కోస్తా జిల్లాలో ఆధ్యాత్మిక, విద్య, సేవా కార్యక్రమాలను ఆర్‌సీఎం ఏలూరు పీఠం తొలి బిషప్ జాన్ ములగాడ అందించారని డాక్టర్ ఫాదర్ పి.బాల అన్నారు. సోమవరప్పాడు సెయింట్ జాన్స్‌బీఈడీ విద్యా సంస్థల్లో జాన్ ములగాడ వర్ధంతి జరిగింది.
- **భీమడోలు :** గుండుగొలను సీతారామస్వామి ఆలయంలో హోమాలు, కల్యాణ మహోత్సవాలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారికి పవిత్ర రక్షలు, అలంకరణను వైభవంగా నిర్వహించారు.
- **నిడమర్రు :** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు సైకిళ్లు అందజేయడం అభినందనీయమని పెదనింద్రకొలను సర్పంచ్ ముగ్గళ్ళ యాకోబు అన్నారు. గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కోడూరి సోమేశ్వరరావు, మాధవరపు రాజా పంపిణీ చేశారు. బండి రమణ, ఎస్ఎంసీ ఛైర్మన్ సత్యనారాయణ, హెచ్ఎం పివి సత్యనారయణ, పొట్నూరి సింహచలం, గాజుల వాసు పాల్గొన్నారు.
- **ద్వారకాతిరుమల :** టీడీపీ మండల అధ్యక్ష పదవిని బీసీలకు కేటాయించాలని బీసీ సంఘ నేతలు శుక్రవారం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుకు వినతిపత్రం అందజేశారు. కూరాకుల బుజ్జి, రేపూరి వెంకటేశ్వరావు, కంకిపాటి గాంధీ తదితరులు వినతి పత్రం అందించారు.
- **పోలవరం :** గ్రామంలో పారిశుధ్యం మెరుగుదలకు కార్యదర్శి వై కొండలరావు చర్యలు చేపట్టారు. సర్పంచ్ పొడుం పుష్ప సూచనలతో బీసీ కాలనీ, కొత్తపేట, బాహూజీ కాలనీ ప్రాంతాల్లో మురుగునీటిని మోటార్లతో బయటకు తోడారు. చెత్తను తొలగించి ట్రాక్టర్లపై తరలించారు.

ఎన్డీఏ రాకతో తిరుమలకి పూర్వ వైభవం



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని

కైకలూరు, ఆగస్టు 16: ఎన్డీఏ ప్రభుత్వం వచ్చిన తరువాత టీటీడీకి పూర్వ వైభవం వచ్చిందని కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం దర్శించుకున్నారు. ఉదయాన్నే స్వామివారి ప్రత్యేక పూజలో ఆయన పాల్గొన్నారు. కైకలూరు నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

పాఠశాలకు కంప్యూటర్ల వితరణ



ముక్కొల్లుపాడు పాఠశాలకు కంప్యూటర్ బహూకరిస్తున్న దృశ్యం

మండవల్లి ఆగస్టు 16 : భైరవపట్నంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు పూర్వ విద్యార్థులు సుమారు రూ.60 వేలు విలువ చేసే నాలుగు కంప్యూటర్లను శుక్రవారం అందజేశారు. హెచ్ఎం ఎన్వీవీ సుబ్రహ్మణ్యం పూర్వపు విద్యార్థులు సనాతన, మరి కొంతమంది వితరణతో నాలుగు కంప్యూటర్లను ఏర్పాటు చేశారు. సర్పంచ్ ఎం.రాధా నాగేశ్వరరావు, ఎంపీటీసీ ఎస్.కిరీటరాజు, మాజీ సర్పంచ్ చదలవాడ శ్రీమన్నారాయణ, ఎంఈఓ-2 రత్నసునందం తదితరులు పాల్గొన్నారు.

● నూజివీడు టౌన్ : ముక్కొల్లుపాడులోని ఎంపీపీ పాఠశాలలకు పూర్వ విద్యార్థులు కంప్యూటర్‌ను వితరణగా ఇచ్చారు. గ్రామ టీడీపీ నాయకులు పర్వతనేని సాయి ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు బత్తుల శివాజీ, కొండేటి సతీష్, గుడిసేటి కృష్ణ సుమారు రూ.50 వేల విలువ చేసే కంప్యూటర్‌ను పాఠశాలకు అందజేశారు. దిగవల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థికి ఎస్ఎంసీ ఛైర్మన్ పులపాక రవిబాబు చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతిని అందించారు. పాఠశాలకు చెందిన కె.శైలజ 542 మార్కులు సాధించడంతో గ్రామస్థులు గుణదల సుధాకర్ రూ.రెండు వేల చెక్కును అందజేశారు.

వాజపేయికి ఘన నివాళి



వాజపేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

కైకలూరు, ఆగస్టు 16: మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజపేయి సేవలు మహోన్నత మైనవని నియోజకవర్గ కన్వీనర్ వేంపాటి విష్ణురావు అన్నారు. వాజపేయి వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయన చిత్రపటానికి కైకలూరులో బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల బీజేపీ అధ్యక్షుడు కట్టా వీరరాఘవులు, కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు కీర్తి వెంకటరాంప్రసాద్, ఓబీసీ మోర్చ జిల్లా కార్యదర్శి బొల్లా శ్యామలరావు, నాయకులు పి.రాంబాబు, వి.వెంకట సుబ్బారావు, పి.మహాలక్ష్మణుడు, పాల్గొన్నారు.

మండలాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయాలి

మండవల్లి ఆగస్టు 16 : అన్న క్యాంటీన్లను కేవలం నగర, పట్టణ ప్రాంతాలలో మాత్రమే కాకుండా మండల కేంద్రాల్లో కూడా ఏర్పాటు చేయాలని సామాజిక వేత్తలు ఎల్ఎస్ భాస్కరరావు, టి.అప్పారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గ్రామీణా ప్రాంతాల్లోనే పేదలు ఎక్కువగా ఉంటారని, ప్రారంభంలో గ్రామాల్లో ఏర్పాటు చేయలేకపోయినా కనీసం మండల కేంద్రాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయాలన్నారు.

రాత్రి వైద్యున్ని నియమించాలని వినతి



మంత్రితో గోళ్ళ రాజు

ఆగిరిపల్లి, ఆగస్టు 16: స్థానిక ప్రాథమిక హెల్త్ సెంటర్‌లో నైట్ డ్యూటీ డాక్టర్ లేకపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందిని ఆగిరిపల్లి మండల తెలుగుయువత అధ్యక్షుడు గోళ్ళరాజు, నూజివీడు రాష్ట్ర సమాచార పౌర శాఖ సంబంధాల శాఖ, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకువెళ్ళారు. స్పందించిన మంత్రి డీఎంహెచ్‌వోతో మాట్లాడి కొద్ది రోజుల్లో వైద్యుని నియమిస్తామని హామీ ఇచ్చారని గోళ్ల రాజు తెలిపారు.

పాల్ రమేష్‌కు ఉత్తమ సేవా పురస్కారం



మంత్రి చేతులమీదుగా పురస్కారం అందుకుంటున్న పాల్ రమేష్

ఆగిరిపల్లి, ఆగస్టు 16: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మండలంలోని పోతవరప్పాడుకు చెందిన గాడ్సన్ మినిస్ట్రీస్ డైరెక్టర్ కోలేటి పాల్ రమేష్‌కు జిల్లా స్థాయి ఉత్తమ సేవా పురస్కారం లభించింది. ఏలూరులో జరిగిన వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి కొలుసు పార్థసారథి చేతులమీదుగా జిల్లా కలెక్టర్, ఎస్పీ మొదలైన జిల్లాస్థాయి అధికారుల సమక్షంలో ఈ అవార్డు అందుకున్నారు. 2007లో పోతవరప్పాడులో ఎలిజబెత్ చిల్డ్రన్ హోమ్‌ను ఏర్పాటు చేసి ఇప్పటివరకు 200 మందికి పైగా అనాథలను స్వయంశక్తి గలవారిగా తీర్చిదిద్దారు. మరో పది మంది వితంతువులను పోషిస్తున్నారు. అంతేగాక వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తనకు ఉత్తమ సేవా పురస్కారంనకు ఎంపిక చేసిన అధికారులకు, ప్రజా ప్రతినిధులకు పాల్ రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని వివిధ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, వివిధ క్రైస్తవ సంఘాల పాస్టర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్‌రమేష్‌కు అభినందనలు తెలిపారు.

సీపీఎం నాయకుడు దుర్గారావు మృతి



నూజివీడు టౌన్, ఆగస్టు 16: సీపీఎం సీనియర్ నాయకుడు ఎలినేని దుర్గారావు (84) అనారోగ్య కారణాలతో శుక్రవారం మృతి చెందారు. నూజివీడు ప్రాంతంలో కార్మిక సమస్యలతో పాటు భూ పోరాటాలలో ఆయన పాల్గొని అహర్నిశలు శ్రమించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గుడిపాడులో కొనసాగుతున్న వైద్యశిబిరం



గుడిపాడులో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

ముసునూరు, ఆగస్టు 16: మండలంలోని గుడిపాడులో వైద్యశిబిరం కొనసాగుతోంది. డెంగ్యూ పాజిటివ్ కేసు రావడంతో రమణక్కపేట పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ కరిముల్లా ఆధ్వర్యంలో శుక్రువారం 44మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఇద్దరు జ్వరంతో బాధపడుతున్నారని, వీరికి డెంగ్యూ పరీక్షలు నిర్వహించగా నెగిటివ్ వచ్చినట్లు వైద్యులు తెలిపారు. అలాగే ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి చికిత్స అందించి మందులు అందజేశారు. అలాగే మంచినీటి సరఫరా ట్యాం కుల్లో క్లోరినేషన్‌ను పరిశీలించి, నీటి శాంపిల్స్‌ను ఏలూరు ల్యాబ్‌కు పంపినట్లు కరిముల్లా తెలిపారు. సర్పంచ్ రాజబోయిన శ్రీదేవి ఆధ్వర్యంలో దోమల నివారణకు గ్రామంలోని అన్నికాలనీల్లో ఫాగింగ్ చేశారు. వాతావరణంలో మార్పులు వల్ల సీజనల్ జ్వరాలు వస్తున్నాయని, ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమ తెరలను వాడుకోవాలని, ఆరోగ్య సూత్రాలు పాటించాలని వైద్యులు కరిముల్లా కోరారు.

కల్యాణ మండపానికి స్థల సేకరణ

ఆగిరిపల్లి ఆగస్టు 16 : తోటపల్లిలో వేంచేసి ఉన్న దుగ్గిరాల బాలరావమ్మ ఆలయ వద్ద మంత్రి కొలుసు పార్థసారథి హామీ మేరకు అమ్మవారికి రూ.40 లక్షలతో కల్యాణ మండపం, రూములు నిర్మించడానికి స్థల పూర్తి చేశామని నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ బీసీసెల్ అధ్యక్షుడు ఆరేపల్లి శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. అలాగే భక్తులకు అన్న సమారాధనకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దేవస్థాన మాజీ చైర్మన్ రామకృష్ణ, బి.శివరాం ప్రసాద్, డి.మోహన్‌రావు, కె.కిశోర్, ఎన్.నాగేంద్రం ప్రసాద్ పాల్గొన్నారు.

పేదల ఆకలి తీరుతుంది

- మంత్రి పార్థసారథి
- నూజివీడులో అన్న క్యాంటీన్ ప్రారంభం
- అల్పాహారాన్ని ప్రజలకు వడ్డించి వారితో కలిసి తిన్న మంత్రి



అన్న క్యాంటీన్‌లో అల్పాహారం తింటున్న మంత్రి సారథి

నూజివీడు, ఆగస్టు 16: పేదల ఆకలిని తీర్చడమే అన్న క్యాంటీన్ల ఏర్పాటు లక్ష్యమని, రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు పట్టణంలోని ఆర్ఆర్‌పేటలో అన్నక్యాంటీన్ మంత్రి పార్థసారథి శుక్రవారం ప్రారంభించారు. ప్రజలకు స్వయంగా అల్పాహారాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు, పేదలు వివిధ పనుల మీద పట్టణాలకు వస్తుంటారని వీరికి అల్పాహారం, భోజనం రూ. ఐదులకే అందించాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ, పారిశ్రామికాభివృద్ధితో పాటు వివిధ రంగాలను అభివృద్ధి బాట పట్టించి, యువతకు, రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు అందించేందుకు ముఖ్యమంత్రి దిశ,నిర్దేశం చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ప్రధానమైన ఐదు హామీల అమలుకు సంతకాలు చేశారన్నారు. పారిశ్రామిక రంగంలో నైపుణ్యం కలిగిన వారికి డిమాండ్ ఉందని, అందుకే యువతకు అభిరుచి కలిగిన రంగంలో నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్థానిక సంస్థల నిధులను వారి అనుమతి లేకుండా, వారికి తెలియకుండా పూర్తిగా మళ్ళించిన ఘనత గత జగన్ ప్రభుత్వానిదన్నారు. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసం, రాష్ట్రానికి చేసిన నష్టాన్ని ప్రజలకు తెలియచేయాల్సిన బాధ్యత కూటమి నేతలకు ఉందన్నారు. అన్ని రంగాల్లో నష్టపోయిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టి అభివృద్ధి పథంలో నడిపేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నార మంత్రి సారథి అన్నారు. అనంతరం అన్న క్యాంటీన్‌లో అల్పాహారాన్ని మంత్రి రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ వెంకట రామిరెడ్డి, డీఈ లక్ష్మీనారాయణ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏలూరులో అల్పాహారంతో ప్రారంభం

అల్పాహారంతో శుక్రవారం ఉదయం అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. ఏలూరు జిల్లావ్యాప్తంగా ఆరు అన్న క్యాంటీన్లను శుక్రవారం నుంచి ప్రారంభించాలని అనుకున్నా తొలిరోజు మాత్రం ఒక్క జంగారెడ్డిగూడెం మినహా నూజివీడులో ఒకటి, ఏలూరులో నాలుగు అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. ఏలూరు నగరంలో కలెక్టరేట్, ఆర్ఆర్ పేట, తంగెళ్ళమూడి, బాలాజి థియేటర్ సమీపంలో ఉదయం ఏడు గంటల నుంచే అల్పాహారాన్ని ప్రారంభించారు. ప్లేటు రూ.ఐదు చొప్పున ఇడ్లీ, లేదా పూరిని తొలినాడు అందించగలిగారు. మధ్యాహ్నం వేళ అన్నం, కూర, పప్పు లేదా సాంబారు, పెరుగు, పచ్చడి వడ్డించారు. అన్నిచోట్ల అన్న క్యాంటీన్లన్నీ ఉదయం నుంచి రాత్రి వరకు కిక్కిరిసిపోయాయి.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు



చాట్రాయి మండలం ఆరుగొలనుపేట శ్రీలక్ష్మమ్మ ఆలయంలో భక్తుల పూజలు

నూజివీడు టౌన్/ముసునూరు/కలిదిండి/చాట్రాయి/కైకలూరు, ఆగస్టు 16: వరలక్ష్మీ వ్రతం పర్వదినాన్ని మహిళలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయాల్లో అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు తమ ఇళ్లలో వరలక్ష్మీ వ్రతాలను ఆచరించి ముత్తైదువులకు వాయనాలు ఇచ్చారు. తమ పసుపు కుంకుమలు చల్లగా ఉండాలని, అమ్మవారి అనుగ్రహంతో సిరిసంపదలు కలగాలని మహిళలు శ్రీ వరలక్ష్మీ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారిని దర్శించుకోవడానికి ఉదయం నుంచి భక్తులు బారులు తీరారు. ఈవో వీఎన్‌కే శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గౌతు లచ్చన్న ఆశయాలు మహోన్నతమైనవి



కైకలూరులో సర్దార్ గౌతులచ్చన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

కైకలూరు, ఆగస్టు 16: బలహీనవర్గాల ప్రజల అభ్యున్నతికి శ్రమించడమే గాక స్వాతంత్ర్య ఉద్యమంలో ఎనలేని పోరాటం చేసిన సర్దార్ గౌతులచ్చన్న ఆశయాలు మహోన్నతమైనవని టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహరావు అన్నారు. సర్దార్ గౌతులచ్చన్న జయంతి సందర్భంగా శుక్రవారం కైకలూరులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు నేతలు మాట్లాడుతూ దేశంలోనే సర్దార్ వల్లభాయ్‌పటేల్ తర్వాత సర్దార్ అనే బిరుదు దక్కిన వ్యక్తి గౌతులచ్చన్న అన్నారు. ప్రభుత్వం గౌతులచ్చన్న జయంతి, వర్ధంతిని నిర్వహించాలన్నారు. రాష్ట్ర గౌడ సంక్షేమ సంఘం నాయకుడు పి.చెంచు రామారావు, పి.పాపారావు గౌడ్, సాహితీవేత్త సీహెచ్ వెంకటనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు పి.త్రినాధరాజు, గౌడ సంఘం నేతలు ఎం.లక్ష్మయ్య, బి.శ్యామలరాజు గౌడ్, కె.నాగరాజు గౌడ్, కె.రాఘవులు, పి.రాంబాబు, ఎం.నరసింహమూర్తి, డి.శ్రీనివాసరావు, పి.వాసు, ఎం.గణపతి, తదితరులు పాల్గొన్నారు.

● ముదినేపల్లి : ముదినేపల్లిలో సర్దార్ గౌతు లచ్చన్న 115వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. స్థానిక గురజ రోడ్డు సెంటర్‌లో కైకలూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, పోల్ మేనేజ్‌మెంట్ ఇంచార్జ్ కొడాలి వినోద్ సర్దార్ లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వర్గీయ లచ్చన్న తన ఆశయాలతో నేటి తరానికి ఆదర్శంగా నిలిచారని పలువురు పేర్కొన్నారు. మాజీ ఎంపిటిసి కట్టా కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు హనుమార పేర్నీడు, వల్లూరిపల్లి రామకృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీబీ కెనాల్లో పేరుకుపోయిన తూడు

- తొలగించాలని రైతుల వినతులు



కెనాల్లో దట్టంగా ఉన్న గుర్రపు డెక్క, తూడు

కలిదిండి, ఆగస్టు 16 : గుర్వాయిపాలెం సీబీ కెనాల్‌లో గుర్రపు డెక్క, తూడు, నాచు సుమారు రెండు కిలోమీటర్ల మేర దట్టంగా పేరుకుపోయింది. దీంతో కెనాల్‌కు తాగునీరు పూర్తిగా విడుదల చేసినప్పటికీ పారడం లేదు. తాగు, సాగునీరందక రైతులు అవస్థలు పడుతున్నారు. సీబీ కెనాల్‌లో ఎగువ నుంచి కొట్టుకువచ్చిన గుర్రపు డెక్క తూడు తెప్ప కొండంగి లాకుల వద్ద నుంచి గుర్వాయిపాలెం వంతెన సమీపంలో పెదలంక కాల్వ వరకు దట్టంగా పేరుకుపోయింది. ఈ తెప్పలపై నుంచి రైతులు కాల్వ అవతల వైపునకు నడిచి వెళ్తున్నారంటే గుర్రపు డెక్క ఏ విధంగా పేరుకుపోయిందో అర్థమవుతుంది. సాగునీటి కొరత ఏర్పడడంతో ఈ నెల 19 నుంచి కొండంగి 1, 2 ఎత్తిపోతల పథకాలను పునఃప్రారంభించటానికి సన్నాహాలు చేస్తున్నారు. అయితే కొండంగి లాకుల వద్ద నుంచి గుర్వాయిపాలెం వంతెన వరకు రెండు కిలోమీటర్లు పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూడు, నాచు, చెత్త చెదారం తొలగిస్తేనే ఎత్తిపోతల నీరు కాల్వ పారుతుంది. సాగు, తాగునీటి సరఫరాకు అడ్డుకట్టగా ఉన్న గుర్రపు డెక్క, తూడు తెప్పలను తొలగించాలని అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ పట్టించుకోవటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కాల్వల్లో డెక్క, తూడును తూతూ మంత్రంగా తొలగించి కాంట్రాక్టర్లు చేతులు దులుపుకుంటున్నారని రైతులు విమర్శిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సిబి కెనాల్‌లో తాగు, సాగునీరు సరఫరా కావాలంటే దట్టంగా పేరుకుపోయిన డెక్క, తూడును తక్షణమే తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

డెక్క తొలగిస్తేనే ఎత్తిపోతల నీరు



కొండంగి లాకుల నుంచి గుర్వాయిపాలెం వంతెన వరకు పేరుకుపోయిన డెక్క, తూడును తొలగిస్తేనే ఎత్తిపోతల నీరు సరఫరా అవుతుంది. సుమారు 20 వేల ఎకరాలకు సాగు నీరు చేరుతుంది. ఎత్తిపోతల ప్రారంభానికే ముందే డెక్క తూడు తొలగించాలి. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- మంతెన సుబ్బరాజు, రైతు

ఏటీఎంలో చోరీ యత్నంపై దర్యాప్తు



ఏటీఎంను పరిశీలిస్తున్న ఎస్ఐ వెంకట్ కుమార్

ముదినేపల్లి, ఆగస్టు 16 : ముదినేపల్లిలోని యాక్సిస్ బ్యాంకు ఏటీఎంలో గురు వారం తెల్లవారు జామున ఓ దుండగుడు చోరీకి ప్రయత్నించి పోలీసుల రాకతో పరారయ్యాడు. ముఖ్య కూడలి ప్రదేశం, స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమీపంలోని ఈ ఏటీఎం చోరీకి ఆ దుండగుడు అత్యం త చాకచక్యంగా వ్యవహరించి, విద్యుత్ సరఫరా నిలిపివేసి ఏటీఎంలోని బాక్సును పగులకొట్టి నగదును అపహ రించాలని ప్రయత్నించాడు. ఈ ఏటీఎం వద్ద మోగిన సైరన్‌తో ముంబయిలోని యాక్సిస్ బ్యాంక్ ఏటీఎంల నిర్వహణ కార్యాలయం నుంచి వచ్చిన ఫోన్ కాల్‌తో ముదినేపల్లి పోలీసులు అప్రమత్తమై రంగ ప్రవేశం చేయడంతో దుండగుడు పరారయ్యాడు. కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్, ఏలూరు క్లూస్ టీమ్ పరిశీలించారు. ముదినేపల్లి, వడాలి, శ్రీహరిపురం, సింగరాయపాలెం గ్రామాల్లోని ఏటీఎంల భద్రతపై కూడా ఆయా బ్యాంకుల అధికారులతో చర్చిస్తామని ఎస్ఐ వెంకట్ కుమార్ తెలిపారు. రాత్రిళ్లు ఏటీఎంల వద్ద పోలీసు నిఘా పెంచుతా మన్నారు.

ఏటీఎం మూసివేత

ముదినేపల్లిలో చోరీ ప్రయత్నానికి గురైన యాక్సిస్ బ్యాంక్ ఏటీఎంను బ్యాంక్ అధికారులు మూసివేశారు. ఈ సంఘటనతో ఏటీఎంలో సొమ్ము పోలేదని పోలీసుల పరిశీలనలో వెల్లడైంది. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఏటీఎంను బ్యాంక్ టెక్నీషియన్ బృందం శుక్రవారం పరిశీలించింది. దోపిడీకి ప్రయత్నించిన దుండగులు విద్యుత్ కనెక్షన్‌ను కట్ చేయడంతో ఏటీఎం మెషిన్‌కు విద్యుత్ సరఫరా పునరుద్ధరించే పనులు చేపట్టారు.

భర్తను కడతేర్చిన భార్య

పెదనిండ్రకొలనులో సంఘటన



నిడమర్రు ఆగస్టు 16 : భర్త వేధింపులకు తట్టుకోలేక కట్టుకొన్న భార్యే భర్తను కడతేర్చిన సంఘటన పెదనిండ్రకొలనులో చోటు చేసుకొంది. తాగుడుకు బానిసై దొరికిన చోటల్లా అప్పులు చేసి కుటుంబాన్ని రోడ్డున పడేస్తున్న కట్టుకొన్న మొగుడు తనపై దాడి చేస్తుంటే చివరకు అతడినే హతమార్చింది. నిడమర్రు ఎస్ఐ వీరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం నిడమర్రు మండలం పెదనిండ్రకొలనులో వైఎస్ఆర్ కాలనీ ఎస్సీ కాలనీలో భార్య, భర్తలు నివసిస్తున్నారు. వీరి ఒక కుమార్తె ఉంది. ఆమెకు ఆరు నెలల క్రితం వివాహం చేశారు. పెళ్లయిన నాటి నుంచి వారు గొడవలు పడుతున్నారు. శుక్ర వారం భార్యభర్తలు ఘర్షణ పడ్డారు. భర్త ఏసు గుపల్లి శ్రీను (36) అక్కడే గల గునపం తీసుకొని ఆవేశంలో తాము నివాసం ఉంటున్న రేకుల షెడ్డును కూల్చబోగా భార్య ఝాన్సీరాణి (32) అడ్డువెళ్లి అతన్ని ఆపబోయింది. తనపై గునపంతో దాడి చేయబోయిన భర్త నుంచి గునపం లాక్కొని తిరగి అతని తలపై బలంగా బాదడంతో శ్రీను అక్కడికక్కడే కుప్పకూలపోయాడు. భర్తను కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ అతను అప్పటికే చనిపోయాడు. సమాచారం అందడంతో పోలీసులు అక్కడకు చేరుకుని శ్రీను మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇళ్లలోని విద్యుత్ ఉపకరణాలు దగ్ధం

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 16: తాడేపల్లిగూడెం శేషమహల్ వెనుక భాగంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ లోపంతో ఇళ్లలోని విద్యుత్ ఉపకరణాలు కాలిపోయాయి. ట్రాన్స్‌ఫార్మర్‌లో వచ్చిన సాంకేతిక లోపంతో ఏసీలు, ఫ్రిడ్జ్‌లు, బల్బులతోపాటు మరిన్ని ఉపకరణాలు కాలిపోవడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాకపోవడంతో ఉన్నతాధికారులు సమస్య పరిష్కారానికి కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు పెదలంక జడ్పీ హైస్కూల్ ఎస్ఎంసీ ఎన్నిక

కలిదిండి, ఆగస్టు 16 : మండలంలో పెదలంక జడ్పీ హైస్కూల్‌లో శనివారం ఎస్ఎంసీ ఎన్నిక నిర్వహిస్తున్నామని ఎంఈవో నరేష్ కుమార్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల ఎనిమిదిన కోరం లేక వాయిదా పడిందన్నారు. శనివారం ఉదయం తొమ్మిది గంటల కల్లా విద్యార్థుల తల్లిదండ్రులు జడ్పీ హైస్కూల్‌కి చేరుకుని ఎస్ఎంసీ ఎన్నికల్లో పాల్గొనాలన్నారు. పోలీసు బందోబస్తు మధ్య ఎన్నిక నిర్వహిస్తున్నామన్నారు.

ఆయుర్వేద ఆస్పత్రికి ఎన్ఏబీహెచ్ అవార్డు



డాక్టర్ సుభాష్ చంద్రబోస్‌ను సన్మానిస్తున్న ఎన్‌డీఏ నాయకులు

ముదినేపల్లి, ఆగస్టు 16 : కేంద్ర ప్రభుత్వ జాతీయ ఆరోగ్య సంరక్షణ బోర్డు రూపొందించిన వైద్య ప్రమాణాలు, ఆరోగ్య సూత్రాలను పాటిస్తున్న పెదగొన్నూరు లోని ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రికి ఉత్తమ అవార్డు లభించింది. ఏపీలో ఆయుష్ విభాగంలో ఈ ఆరోగ్య సంరక్షణ బోర్డు 2024కి 64 ఉత్తమ ఆస్పత్రులను ప్రకటించగా, వాటిలో పెదగొన్నూరు ఆయుర్వేద ఆస్పత్రి ఒకటి. ఏలూరు జిల్లాలో ఈ ఆస్పత్రి ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ మేరకు నేషనల్ అక్రిడేటెడ్ బోర్డు ఫర్ హెల్త్ ఉత్తమ ఆస్పత్రుల జాబితాను ప్రకటించింది. ఆస్పత్రి నిర్వహణ, వైద్య సేవలను సంతృప్తి కరంగా అందించటం, బోర్డు సూచనలను అమలు చేయటం, ఆయు ర్వేద మందులను అందు బాటులో ఉంచడం లాంటి అంశాలను మేరకు ఉత్తమ ఆస్పత్రిగా ప్రకటించారు.

వైద్యాధికారికి సత్కారం

ఉత్తమ ఆయుర్వే ఆస్పత్రిగా ఎంపికైన పెదగొన్నూరు ప్రభుత్వ ఆయుర్వే ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ చల్లా సుభాష్ చంద్రబోస్‌ను శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఆస్పత్రి నిర్వహణపై శ్రద్ధ చూపిస్తూ జాతీయ స్థాయి బోర్డు గుర్తింపు పొందేందుకు కృషి చేసిన డాక్టర్ బోసును ఎన్‌డీఏ కూటమి నాయకులు గుడివాడ వేణు, శ్రవణం పూర్ణచంద్రరావు, గుడిసేవ సురేష్, యాసర్ల నాగేంద్రరావు, రాజేష్, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ శ్యామ్, అంగన్‌వాడీ కార్యకర్త కె.జయలక్ష్మి తదితరులు సన్మానించారు.

లక్ష్మీభవానీ మృతిపై ఆత్మహత్య కేసు

ముదినేపల్లి, ఆగస్టు 16 : ఈ నెల ఎనిమిదిన అదృశ్యమై విజయవాడలో శవమై కన్పించిన కోన మహాలక్ష్మి భవానీ మృతి ఘటనపై పోలీసులు ఆత్మహత్య కేసు నమోదు చేశారు. ఆమె విజయవాడలోని రైవస్ కాల్వలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు సీసీ కెమెరాల ద్వారా గుర్తించడంతో ఆత్మహత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్ కుమార్ తెలిపారు. ఇదిలా ఉండగా, లక్ష్మీభవానీ భర్త నాగార్జున భార్య మృతదేహం కనిపించినప్పటి నుంచి జాడ లేకుండా పోవడంపై కూడా పోలీసులు దృష్టి పెట్టారు. అంత్యక్రియలను కూడా ముదినేపల్లిలో ఆమె సోదరుడే నిర్వహించారు. లక్ష్మీభవానీ ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగులకు కృత్రిమ కాళ్ళు



దాతలతో దివ్యాంగులు

ఆగిరిపల్లి, ఆగస్టు 16: అనుకోని పరిస్థితుల్లో కాళ్ళు కోల్పోయిన వారికి తోటపల్లిలోని హీల్ కృత్రిమ అవయువ కేంద్రం ఆశా కిరణంగా నిలుస్తుందని సక్కు గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ ముత్తవరపు మాధవీలత అన్నారు. గుంటూరు జిల్లా పిడుగురాళ్ళకు చెందిన బూసి మేరీ ఇవాంజలిన్, పశ్చిమ గోదావరి జిల్లా మామడూరుకు చెందిన గుత్తుల మోహినిలకు ఆమె కృత్రిమ కాళ్లను అందజేశారు. ఇబ్బందులలో ఉన్న నిరుపేద, అంధబాలలకు ఉచిత విద్య, వసతి కల్పించడంతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటిలెజెన్స్ కోర్సులు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. హీల్ సంస్థ సీఈవో కూరపాటి అజయ్‌కుమార్ మాట్లాడుతూ హీల్ కృత్రిమ అవయవ కేంద్రం ద్వారా ఇప్పటివరకు 580 కృత్రిమ కాళ్ళు అందచేశామన్నారు. ఈ కార్యక్రమంలో హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మీ, డైరెక్టర్లు మలినేని రంగప్రసాద్, వైవీఎస్ చలపతిరావు, సీనియర్ టెక్నీషియన్ కె.చిన్నా, కృత్రిమ అవయువ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

గొల్లపల్లిలో గ్రామ సభ



గ్రామ సభ నిర్వహిస్తున్న దృశ్యం

నూజివీడు టౌన్, ఆగస్టు 16: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ కార్యక్రమాల్లో భాగంగా గొల్లపల్లిలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. సర్పంచ్ బి.వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన నూజివీడు ఏపీవో ఎస్.సోమేశ్వరి ఆధ్వర్యంలో ఈగ్రామ సభ నిర్వహించగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సోషల్ ఆడిట్ వివరాలను గ్రామ సభలో చర్చించారు. నూజివీడు బీజేపీ మండల అధ్యక్షుడు గోగినేని శ్రీనివాస్ కుమార్ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు వెంటే మేమూ..

ఆగిరిపల్లి, ఆగస్టు 16: సుప్రీం కోర్టు తీర్పును స్వాగతించలేని పరిస్థితుల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని మండలం వైసీపీ ఎస్సీ సెల్ కన్వీనర్ నల్లమోతు కాంచనరావు అన్నారు. సీఎం చంద్రబాబు వర్గీకరణ జీవోను త్వరితగతిన అమలు చేసే దిశగా ముందుకు అడుగులు వేస్తున్నట్లుగా అనిపిస్తుందన్నారు. దశాబ్దాలుగా కాంగ్రెస్, వైసీపీలో ఉన్నా తమకు న్యాయం జరగలేదన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎంపీ హర్షకుమార్ ఏబీసీడీ వర్గీకరణ వ్యతిరేకించారని, నాడు కాంగ్రెస్‌లో మాలలు అధికంగా ఉండటంతో వర్గీకరణ జరగలేదన్నారు. మాదిగల కోసం ఇంత చేస్తున్నా చంద్రబాబుని ఇప్పటివరకు దూరం చేసుకున్నామని, ఇక నుంచి చంద్రబాబు మాటే తమకు శిరోధార్యమన్నారు.

గ్రామాల్లో డ్రైనేజీల సమస్య పరిష్కారం

ముసునూరు, ఆగస్టు 16: ముసునూరు, కాట్రేనిపాడు గ్రామాల్లో డ్రైనేజీల సమస్యలను సర్పంచ్‌లు కొండేటి విజయ లక్ష్మీ యిర్మీ యా, గద్దల సుహాసిని మోహన్‌రావు దశలు వారిగా పరిష్కరి స్తున్నారు. శుక్రవారం ముసునూరులో మెయిన్ సెంటర్‌లో ఉన్న ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్న డ్రైనేజీలో సిల్ట్‌ను ఎక్స్‌కోవేటర్‌తో తొలిగించి, ట్రాక్టర్ల ద్వారా బయటకు తరలించారు. దీంతో మురుగునీరు నిల్వ సమస్యల పరిష్కారం అయింది. అలాగే కాట్రేనిపాడులో బీసీ, ఎస్సీ కాలనీల్లో డ్రైనేజీలను పునరుద్ధ రించారు. ఈ పనులను సచివాలయ కార్యాదర్శులు, సర్పంచ్‌లు పర్యవేక్షించారు.

భార్య మరణంతో.. భర్త ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఆగస్టు 16 : భార్య మరణంతో తీవ్ర కలత చెందిన ఒక వృద్ధుడు జీవితంపై విరక్తి చెంది రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు చాణుక్యపురి కాలనీ ఏటిగట్టు ప్రాంతానికి చెందిన దళాయి కృష్ణ (65)కు భార్య గత ఏడాది మేనెలలో మరణించింది. అప్పటి నుంచి కృష్ణ తీవ్ర మనస్థాపానికి గురై వంటరిగా ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం ఏలూరు శ్రీనివాస థియేటర్ సమీపంలో బ్రిడ్జిపైకి వెళ్ళి రైలు పట్టాలపై నిలబడ్డాడు. అదే సమయంలో కాకినాడ వెళ్ళే ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రైల్వే ఎస్ఐ సైమన్ సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా నమోదు చేసి మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై హత్యాయత్నం..భర్త అరెస్ట్

ఏలూరు క్రైం, ఆగస్టు 16 : భార్యపై తరచూ అనుమాన పడుతూ ఘర్షణ పడుతున్న భర్త అకస్మాత్తుగా చున్నీతో ఆమె మెడకు బిగించి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఏలూరులోని లంబాడీపేటనకు చెందిన బానోతు శివ ప్రసాద్ తన భార్య కనకదుర్గపై అనుమానం పెంచుకున్నాడు. గొడవలు కూడా జరుగుతున్నాయి. పోలీసులకు ఫిర్యాదు చేయగా కౌన్సెలింగ్ ఇచ్చారు. పెద్దల ద్వారా మాట్లాడుకున్నా అతని అనుమానం పెనుభూతం అవుతుందే తప్ప ఏ మాత్రం పోవడం లేదు. ఈ నెల 15వ తేదీన అకస్మాత్తుగా తన మెడకు చున్నీ చుట్టి హత్య చేయడానికి ప్రయత్నించాడు. ఇరుగు పొరుగు వారు చూసి ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ హత్య కేసు నమోదు చేసి శివ ప్రసాద్‌ను అరెస్టు చేశారు.